ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

కొందరి పాపం.. వీరికి శాపం

పెన్షన్ల పరిశీలనలో డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది చేతివాటం

కొనసాగించేందుకు వసూళ్ల పర్వం


అర్హత ఉన్నా పెన్షన్లు రద్దు చేశారని గత సోమవారం కలెక్టర్‌కు చెప్పుకుంటున్న బాధితులు

చిత్తూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పెన్షన్ల పంపిణీని కొంతమంది ఉద్యోగులు అభాసుపాల్జేశారన్న విమర్శలు విన్పిస్తున్నాయి.దేశంలో ఎక్కడా లేని విధంగా సామాజిక పెన్షన్లను రూ.4 వేల చొప్పున, వికలాంగుల పెన్షన్‌ను రూ.6 వేల చొప్పున, బెడ్ రిడెన్ పెన్షన్‌ను రూ.15 వేల చొప్పున ప్రభుత్వ అందిస్తున్న విషయం తెలిసిందే. అయితే పింఛన్లు అందుకుంటున్న వారిలో అనర్హులున్నారన్న ఫిర్యాదులతో ప్రభుత్వం క్షేత్రస్థాయిలో వెరిపై చేయించింది. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో బయటి జిల్లాలనుంచి వైద్యాధికారులను రప్పించి మరీ పెన్షనర్ల వాస్తవ పరిస్థితిని మదింపు చేసింది.ఇంతవరకూ బాగానే వుంది కానీ డీఎంహెచ్‌వో కార్యాలయంలో కొంతమంది పెన్షన్ల కొనసాగింపునకు డబ్బులు వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. పెన్షన్ సెక్షన్‌లో పనిచేసే ఇద్దరు ఉద్యోగులు, ఇద్దరు అటెండర్లు, ఇద్దరు కింది స్థాయి సిబ్బంది కలిసి వసూళ్లకు పాల్పడ్డారని చెప్పుకుంటున్నారు. రూ.15 వేల పెన్షన్ కొనసాగించేందుకు రూ.25 వేలు, రూ.6 వేల పెన్షన్ కొనసాగించేందుకు రూ.10 వేలు వసూలు చేసినట్లు ప్రచారంలో వుంది.జిల్లాలో 1936 బెడ్ రిడెన్ పెన్షన్లు ఉండగా.. ఇటీవల జరిగిన రీఅసెస్‌మెంట్‌లో 824 పెన్షన్లను మాత్రమే కొనసాగించారు. 783మందికి రూ.6 వేలు వచ్చే వికలాంగ పెన్షన్‌గా మార్చారు. అలాగే 71 మందికి రూ.4 వేలు వచ్చే వృద్ధాప్య పెన్షన్ కిందికి మార్చారు. 233 మంది పెన్షన్లను పూర్తిగా రద్దు చేశారు. అలాగే 35277 వికలాంగ పెన్షన్లు ఉండగా, 4361 పెన్షన్లను రద్దు చేశారు.ఈలోపు వైద్యారోగ్య శాఖ సిబ్బంది ఘన కార్యం బయటపడడంతో అధికార యంత్రాంగం ఆందోళన చెందుతోంది.మరోవైపు చాలామంది తమకు అర్హత వున్నా పెన్షన్ సౌకర్యం రద్దు చేశారని ఆవేదన చెందుతున్నారు.పెన్షన్ కోల్పోయినవారంతా పోయిన సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌కు హాజరై ఆందోళన చేశారు.తామంతా నిజమైన దివ్యాంగులమేనంటూ కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు.కలెక్టర్ సుమిత్‌కుమార్ నేరుగా వారి వద్దకు వెళ్లి మాట్లాడారు. పెన్షన్ల రద్దు జాబితాను పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిందే

పెన్షన్లు రద్దయిన వారిలో అర్హులని భావిస్తున్న వారు మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిందేనని అధికారులు చెబుతున్నారు. సచివాలయ సిబ్బంది అందించే రద్దు నోటీసును తీసుకుని, ఆ పరిధిలోని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌తో రెకమెండ్ చేసుకోవాలి. పాత సదరం సర్టిఫికెట్ జత చేసి ఎంపీడీవోకు అందించాలి. ఎన్టీఆర్ భరోసా పోర్టల్‌లో వాటన్నింటినీ ఎంపీడీవో ఫార్వర్డ్ చేస్తారు. ఆ తర్వాత సదరం స్లాట్‌కు హాజరై కొత్త సర్టిఫికెట్ పొందాలి.కాగా పెన్షన్లు రద్దయ్యాయంటూ వికలాంగుల నుంచి అర్జీలు వస్తున్నాయని డీఆర్డీఏ పీడీ శ్రీదేవి చెప్పారు. ఇప్పటివరకు వచ్చిన 42 అర్జీలను ఫార్వర్డ్ చేశానన్నారు. అర్హత ఉన్నవారంతా అప్పీల్‌కు వెళ్లాల్సి ఉంటుందన్నారు.

మంచానికే పరిమితమైన ఇతనికిక రూ.4 వేలే



యాదమరి మండలం కాశిరాలకు చెందిన కల్లుగీత కార్మికుడైన వెంకటస్వామి పాతికేళ్ల కిందట కొబ్బరి చెట్టుపై నుంచి కింద పడ్డాడు. వెన్నుపూస దెబ్బతిని, రెండు కాళ్లు పూర్తిగా చచ్చుపడిపోవడంతో మంచానికే పరిమితమయ్యాడు. ఇంతవరకు బెడ్ రిడెన్ పెన్షన్ కింద నెలకు రూ.15 వేలు తీసుకునేవాడు. తాజాగా రీఅసెస్‌మెంట్‌లో భాగంగా అతని పెన్షన్‌ను వృద్ధాప్య పెన్షన్‌గా మార్చారు. ఇక నుంచి నెలకు రూ.4 వేలే వస్తుంది. రూ.15 వేల పెన్షన్‌కు పూర్తిగా అర్హుడైన తనను ఎందుకు రూ.4 వేల పెన్షన్‌కు మార్చారో తెలియడం లేదంటున్నాడు.

రెండు కాళ్లు పనిచేయకున్నా పూర్తిగా రద్దు



యాదమరి మండలం కీనాటంపల్లె దళితవాడకు చెందిన సురేష్‌కు పాతికేళ్ల కిందట జరిగిన ప్రమాదంతో రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. 2010లో 90 శాతంతో వికలాంగ సర్టిఫికెట్ వచ్చింది. మరొకరు ఎత్తుకుని ట్రై సైకిల్‌లో కూర్చొబెడితేనే కూర్చోగలిగిన ఈయనకు ఇంతవరకు వస్తున్న రూ.15 వేల పెన్షన్‌ను పూర్తిగా తొలగించారు.

30న కుప్పంలో కృష్ణా జలాలకు సీఎం హారతి

రెండు రోజుల్లో పుంగనూరుకు హంద్రీనీవా నీళ్లు

ఆంధ్రజ్యోతితో ఎస్ఈ విఠల్‌ప్రసాద్

పుంగనూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఈనెల 30వ తేది కుప్పం సమీపంలోని పరమసముద్రం చెరువు వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు హంద్రీనీవా జలాలకు హారతి ఇచ్చి స్వాగతించనున్నట్లు హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ విఠల్ ప్రసాద్ తెలిపారు.తిరుపతి తెలుగుగంగ ప్రాజెక్టు చీఫ్ఇంజనీర్ ఎంఎల్ఎన్ వరప్రసాద్‌తో కలిసి పుంగనూరు మండలం ఈడిగపల్లె సమీపంలోని యాతాలవంక, నేతిగుట్లపల్లె ప్రాంతాల్లోని హంద్రీనీవా కాలువ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ విఠల్ ప్రసాద్ ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడుతూ అనంతపురం జిల్లా చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి బుధవారం నాటికి 120 కిలోమీటర్లు ప్రవహించిన నీళ్లు గురువారం మదనపల్లె చేరుతాయన్నారు. పుంగనూరు, పలమనేరు దాటి కుప్పం సమీపంలోని పరమసముద్రం చెరువుకు హంద్రీనీవా జలాలు ఈనెల 26వ తేది లోపు చేరుతాయని వివరించారు. గతంలో కాల్వలు సక్రమంగా లేకపోవడం, లైనింగ్ తదితర సమస్యలతో నీరు పారే పరిస్థితి లేదన్నారు. సీఎం చంద్రబాబు, ఇరిగేషన్ మంత్రి రామానాయుడు ప్రత్యేక చొరవతో పుంగనూరు బ్రాంచికెనాల్‌లో 135 కిలోమీటర్లకు రూ.360 కోట్లు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాలకు రెండు ప్యాకేజీలుగా 130 కిలోమీటర్ల అభివృద్ధికి రూ.170 కోట్లు మంజూరు చేయడంతో కాల్వ విస్తరణ పనులు పూర్తి చేశామన్నారు.


యాతాలవంక వద్ద కాల్వను పరిశీలిస్తున్న సీఈ వరప్రసాద్, ఎస్ఈ విఠల్‌ప్రసాద్

ప్రస్తుతం కృష్ణాజలాలతోబాటు శ్రీశైలం నీరుకూడా వేగంగా చెర్లోపల్లె రిజర్వాయర్‌కు వస్తున్నట్లు చెప్పారు. చెర్లోపల్లెలో 1.08టీఎంసీలు నిల్వ చేసి కాల్వలకు నీరు ఇస్తామన్నారు. మూడులిఫ్టుల పంపింగ్ సిస్టమ్ ద్వారా నీరు గంటకు 2కిలోమీటర్లు పారుతోందని వివరించారు.తొలివిడతలో చివర ప్రాంతమైన పరమసముద్రం చెరువులో 21 ఎంసీఎఫ్‌టీ నీరు ఉంచి కుప్పం నియోజకవర్గంలోని 62 చెరువులు, పలమనేరులో 48 చెరువులు మొత్తం 110 చెరువులకు నీరు ఇచ్చేలా లక్ష్యం పెట్టుకున్నట్లు చెప్పారు. తర్వాత పుంగనూరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని చెరువులకు నీళ్లు ఇస్తామన్నారు.

CTBTA DATE 21-08-2025
TODAY'S LIVE BIRDS & CHICKEN PRICES
CHITTOOR TIRUPATI BROILER TRADERS ASSOCIATION
టుడే సప్లై రేట్ 109/- డ్రెస్డ్ స్కిన్‌తో 200/-
రిటైల్ లైవ్ బర్డ్ 134/- స్కిన్‌లెస్ 225/-
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

విద్యాశాఖలో అంతర జిల్లాల బదిలీలకు నోటిఫికేషన్

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అంతర జిల్లాల బదిలీలకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. స్పౌజ్, మ్యూచువల్ బదిలీలపై ప్రతిపాదనలు రాష్ట్ర విద్యాశాఖకు పంపాల్సి ఉంది. ఒకే మేనేజ్‌మెంట్‌లో పనిచేస్తున్న వారికి కేవలం జిల్లాల మధ్యనే బదిలీలు చేపట్టనున్నారు. ఉపాధ్యాయుడు/హెచ్ఎం ప్రస్తుతం పనిచేస్తున్న వివరాలు, బదిలీ కోరుకునే ప్రాంత వివరాలు మాత్రమే పంపాల్సి ఉంది. వ్యక్తిగత, వైద్య కారణాలపై బదిలీ ప్రతిపాదనలు పంపరాదు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ పేర్కొంది.

ఐటీఐల్లో ఖాళీ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి మూడో దఫా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 25వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐలకు దరఖాస్తు చేసుకుంటే 29వ తేదీన, ప్రైవేటు ఐటీఐలకైతే ఈనెల 30వ తేదీన కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు.

3,61,848 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

చిత్తూరు రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 3,61,848 మంది పిల్లలకు ఆల్బెండజోల్ (నులిపురుగు నివారణ) మాత్రలు పంపిణీ చేసినట్లు అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ తెలిపారు. ఈనెల 12వ తేదీన మాత్రలు తీసుకోని పిల్లలకు బుధవారం పంపిణీ చేశామన్నారు. దాంతో 99.81 శాతం పూర్తి చేసినట్లు వివరించారు. పూతలపట్టు జడ్పీ పాఠశాలలో ఆర్‌బీఎస్కే నోడల్ అధికారి గిరి విద్యార్థులకు మాత్రలు వేశారు.

'వికసిత్' వర్క్‌షాప్‌లో తొలి రెండు స్థానాలు మనవే


ప్రథమ బహుమతి అందుకుంటున్న ఏపీసీ వెంకటరమణ

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వికసిత్-2047 కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర విద్యాశాఖ-సమగ్రశిక్ష సోమవారం విజయవాడలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో మన జిల్లా తొలి రెండు స్థానాలను కైవసం చేసుకుంది. పరిపాలనలో భాగంగా ఏ శాఖ భవనం ఏర్పడాలన్నా, అందుకు ముఖ్య కారణం విద్య నేర్పించే పాఠశాల భవనమే అనే అంశంపై 'స్కూలింగ్ బిల్డింగ్స్ బ్లాక్స్'పై చేసిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు మొదటి స్థానం దక్కింది. అలాగే విద్య నేర్పించడంపై మెలకువలు, పాటించాల్సిన నియమాలపై 'ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ' అంశంగా చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు రెండో స్థానం దక్కింది. మొదటి జట్టులో ఎస్ఎస్ ఏపీసీ వెంకటరమణ, రెండో జట్టులో డీఈవో వరలక్ష్మిలు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు, సమగ్రశిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు నుంచి అవార్డులను అందుకున్నారు.

రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

● అమరావతి నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం

రేణిగుంట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట సమీపంలోని విమానాశ్రయం దగ్గరున్న ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ డిజిటల్ టెక్నాలజీస్ భవనంలో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ స్పోక్స్ కేంద్రం అందుబాటులోకి వచ్చింది. అమరావతి నుంచి సీఎం చంద్రబాబు బుధవారం మధ్యాహ్నం వర్చువల్‌గా ప్రారంభించారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్వీయూ వీసీ అప్పారావు, జేసీ శుభం బన్సల్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీతో కలిసి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఇక్కడి స్పోక్స్ కేంద్రం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మంగళగిరిలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. యువ పారిశ్రామికులకు, స్టార్టప్ పెట్టాలనుకునే వారికి, మంచి ఆలోచనలుండి మార్గదర్శకత కోసం వేచిచూస్తున్న వారికి రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ గొప్ప అవకాశంగా మారుతుందన్నారు. గడిచిన 24 గంటల్లో 1600 మంది యువకులు తమ కంపెనీలు ప్రారంభించేందుకు రిజిస్టర్ చేసుకున్నారన్నారు. హబ్ అమరావతిలో ఉంటుందని, విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, అనంతపురం, తిరుపతిలో ఐదు స్పోక్స్ కేంద్రాలు ఏర్పాటు చేశారని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. తిరుపతి కేంద్రానికి లీడ్ అదానితో పాటు నవయుగ, అమర్ రాజా లీడ్ పార్టనర్లుగాను, ఐఐటీ నాలెడ్జ్ పార్టనర్‌గా ఉందన్నారు. ఇది ప్రభుత్వ, కార్పొరేట్, అకడమిక్ రంగాల సమ్మేళనమన్నారు. అందరూ కలిస్తేనే ఇన్నోవేషన్ సాధ్యమని చెప్పారు. అకడమిక్ పరంగా యూనివర్సిటీలు.. ఇండస్ట్రీ పరంగా చూస్తే శ్రీసిటీ, మేనకూరు సెజ్ ఉండగా, రౌతు సూరమాల వస్తున్నదన్నారు. క్రిస్ సిటీ, రేణిగుంట విమానాశ్రయం వద్ద ఎలక్ట్రానిక్ తయారీ క్లస్టర్-1, 2 ఉన్నాయన్నారు. జిల్లాలో మంచి ఇండస్ట్రీ వాతావరణం ఉందని, ఎవరైనా ఎంటర్‌ప్రెన్యూర్ కావడానికి గొప్ప అవకాశమని పేర్కొన్నారు. తిరుపతితో పాటు చిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాలవారూ ఈ కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మత్స్యశాఖ, సెన్సార్ సింక్ ఇన్నోవేషన్, కేతన టెక్ టీస్, ఆటో కంపోసైట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫోక్స్ లింక్, కార్బన్ సెల్స్, మనోడ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఫైపర్ పిక్సెల్ రోబోటిక్ ప్రైవేట్ లిమిటెడ్, మైండ్ ట్రానిక్స్, జుమాంజి బాక్స్, రోబో మాక్ ఎస్టీఈఎస్ వాటర్ సొల్యూషన్స్, కోకో మంత్రా, ఎనర్జీ ఎఫిషియన్ అండ్ ఎన్విరాన్మెంట్ ఫ్రెండ్లీ ఫోరం, ఏఈడీఏఏ ఎక్విప్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, పలియో జ్యూస్ సంస్థల స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రభురావు, తహసీల్దారు చంద్రశేఖర్ రెడ్డి, ఎస్వీయూ కల్చరల్ కోఆర్డినేటర్ వివేక్ చౌదరి, ప్రజాప్రతినిధులు, ఆయా పరిశ్రమల యాజమాన్యాలు, అధికారులు పాల్గొన్నారు.


స్టాల్‌లో ఏర్పాటు చేసిన డ్రోన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

అందుబాటులోకి తిరుమల పుష్కరిణి

తిరుమల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో స్వామి పుష్కరిణి మరమ్మతు పనులు పూర్తిచేసుకుని బుధవారం నుంచి భక్తులకు అందుబాటులోకి వచ్చింది. ఏటా బ్రహ్మోత్సవాల ముందు శ్రీవారి పుష్కరిణిని మరమ్మతులను



చేయడం పరిపాటి. ఈక్రమంలో జూలై 20వ తేదీన పుష్కరిణిలో మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. పాత నీటిని తొలగించి అడుగుభాగంలో పేరుకుపోయిన ఇసుక, పాచి తొలగించారు. మెట్లకు రంగులు వేశారు. దాదాపు కోటి లీటర్ల నీటితో పుష్కరిణిని నింపి భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. మరమ్మతుల సందర్భంగా నెలపాటు నిలిపేసిన పుష్కరిణీ హారతిని తిరిగి ప్రారంభించడంతో పాటు భక్తులనూ పుష్కరిణిలోకి అనుమతించారు.

ఇక టీడీపీ మండలాధ్యక్షుల వంతు!

ఎంపిక చేసిన కుప్పం నియోజకవర్గ నాయకుల పేర్లతో ఐవీఆర్ఎస్ ● నేడో రేపో ప్రకటనకు అవకాశం


కుప్పం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో అధికార పార్టీ పదవుల పంపిణీ ఆఖరి దశకు చేరింది.కుప్పం మున్సిపాలిటీతోపాటు నాలుగు మండలాలకు పార్టీ అధ్యక్షుల నియామకంకోసం అధిష్ఠానం ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయ సేకరణ చేయడం ప్రస్తుతం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పంలో రాష్ట్రంలోని ఏ ఇతర నియోజకవర్గాలకన్నా పార్టీ పదవులు, నామినేటెడ్ పదవుల భర్తీ ఆసక్తిని రేకెత్తించే అంశం.ఇటీవలే ప్రధాన నామినేటెడ్ పోస్టులను భర్తీ చేశారు. పీకేఎం ఉడా చైర్మన్‌గా డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, కుప్పం రెస్కో చైర్మన్‌గా వీజీ.ప్రతాప్, కుప్పం వ్యవసాయ మార్కెట్టు కమిటీ చైర్మన్‌గా జీఎం.మునిరాజులతోపాటు ఆయా పాలక మండళ్లకు సభ్యుల నియామకం కూడా మూడునాలుగు రోజుల క్రితమే జరిగింది. అంతకు చాలా ముందుగానే పార్టీ పదవుల భర్తీ కూడా జరిగింది. కుప్పం పురపాలక సంఘం సహా కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాలలో టీడీపీ బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జులను నియమిస్తూ పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు వెలువరించింది. వీటన్నింటికంటే ముందే మండల టీడీపీ అధ్యక్షుల నియామకం జరుగుతుందని భావించినా పోటీ అధికంగా ఉండడంతో పెండింగులో పెడుతూ వచ్చారు. నియోజకవర్గ టీడీపీలో త్రిమూర్తులుగా పార్టీ శ్రేణులు పిలుచుకునే ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, ఇటీవలే పీకేఎం ఉడా చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు రెండు రోజులక్రితం అమరావతికి వెళ్లారు. వీరితో మంతనాలు జరిపిన తర్వాతే కుప్పం నియోజకవర్గంలోని మండల పార్టీ అధ్యక్షుల నియామకానికి ఐవీఆర్ఎస్ నిర్వహించడానికి పార్టీ అధినేత చంద్రబాబు నిర్ణయించినట్లు సమాచారం. ఇటీవల జరిగిన సింగిల్ విండో చైర్మన్ల నియామకాలపై ఆయన కొంత అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. ఆ నిర్ణయాలను సరిదిద్దుతూ అక్కడ అవకాశం పొందని ఒకరిద్దరు స్థానిక నాయకులకు పార్టీ మండలాధ్యక్ష పదవులు కట్టబెట్టే యోచనలో ఉన్నారని చెబుతున్నారు.


కుప్పం టీడీపీ కార్యాలయం

మండలానికి ఇద్దరు చొప్పున....

కుప్పం నియోజకవర్గంలో టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడిగా రాజ్‌కుమార్, కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాల అధ్యక్షులుగా ప్రేమ్‌కుమార్, విశ్వనాథ నాయుడు, ఆనందరెడ్డి ఉన్నారు. వీరి స్థానంలో నూతన అధ్యక్షులను నియమించడానికి ఎప్పటినుంచో కసరత్తు నడుస్తోంది. మండలాధ్యక్ష పదవులకోసం అధిష్ఠానానికి చాలానే దరఖాస్తులు వెళ్లాయి. అయితే ఆశావహుల జాబితాను వడబోసిన అధిష్ఠానం కుప్పం మున్సిపాలిటీకి ముగ్గురిని, మండలానికి ఇద్దరేసి చొప్పున కొన్ని పేర్లను ఎంపిక చేసింది. ఈ పేర్లపై ఆయా మండలాల కార్యకర్తలనుంచి అభిప్రాయ సేకరణ జరిపింది. బుధవారం ఉదయం సుమారు ఆరున్నర గంటల నుంచి దాదాపు మధ్యాహ్నం 12 గంటల దాకా కార్యకర్తలకు ఐవీఆర్ఎస్ విధానం ద్వారా ఫోన్‌కాల్స్ వచ్చాయి. కుప్పం మున్సిపల్ అధ్యక్ష పదవికి ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్ , కాణిపాకం వెంకటేశ్ , ఘునెప్పల పేర్లలో ఒకరిని ఎంపిక చేసుకొమ్మని నిర్దేశించిన సంఖ్య గల బటన్ నొక్కమని ఐవీఆర్ఎస్ కాల్స్‌లో సూచించారు. అలాగే కుప్పం మండలాధ్యక్ష పదవికి కంగుంది సర్పంచి ధనశేఖర్ , రాజగోపాల్ , జేకే.సంతోశ్ , గుడుపల్లె మండలాధ్యక్ష పదవికి ఎల్లప్ప, సుబ్రహ్మణ్యం , శాంతిపురం మండలాధ్యక్ష పదవికి ఉదయ్‌కుమార్ , ఆర్ఎస్.మణి , రామకుప్పం మండలాధ్యక్ష పదవికి రామ్మూర్తి , వెంకటరమణ పేర్లను సూచిస్తూ ఐవీఆర్ఎస్ కాల్స్ పార్టీ శ్రేణులకు వచ్చాయి. అభిప్రాయ సేకరణకోసం పేర్కొన్న పేర్లలో ఎవరో ఒకరిని ఎంపిక చేసి, టీడీపీ మండలాధ్యక్షుల పేర్లను పార్టీ అధిష్ఠానం నేడో రేపో ప్రకటించే అవకాశం ఉంది.

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.67 కోట్లు



ఐరాల(కాణిపాకం), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,67,32,780 లభించింది. బుధవారం స్వామి కానుకలను ఆలయ ఆస్థాన మండపంలో ఈవో పెంచలకిషోర్ పర్యవేక్షణలో లెక్కించారు. ఈ ఆదాయంలో 50 గ్రాముల బంగారు, 1,617 గ్రాముల వెండితో పాటు 397 అమెరికా, 105 కెనడా, 70 ఆస్ట్రేలియా, 5 సింగపూర్ డాలర్లు, 10 ఇంగ్లాండు పౌండ్లు, 230 యూఏఈ దిర్హామ్స్, 325 యూరోలు, ఒక మలేషియా రింగిట్స్, గో సంరక్షణ హుండీ ద్వారా రూ.16,236, నిత్యాన్నదాన కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.41,450 లభించినట్లు ఈవో తెలిపారు. ఆలయానికి ఈ ఆదాయం పూర్తిగా 23 రోజుల్లో లభించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈవో సాగర్‌బాబు, చిత్తూరు ఏసీ చిట్టెమ్మ, ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, హరి మాధవరెడ్డి, ప్రసాద్, ధనపాల్, సీఎఫ్‌వో నాగేశ్వరచౌదరి, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విశ్వశాంతి మహాయాగం





తిరుమల ధర్మగిరి వేదవిజ్ఞానపీఠంలో నాలుగురోజుల పాటు నిర్వహించిన సంగోపాంగ శ్రీశ్రీనివాస విశ్వశాంతి మహాయాగం బుధవారం పూర్ణాహుతితో ముగిసింది. 32 మంది వేదపండితుల సమక్షంలో వైదిక క్రతువులు జరిగాయి. ఈ యాగానికి హాజరైన ఈవో శ్యామల రావు మాట్లాడుతూ.. దేశంలోని వివిధ ప్రాంతాల్లో విశ్వశాంతి యాగాలు, హవనాలను నిర్వహించాలని టీటీడీ నిర్ణయం తీసుకుందన్నారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, పీఠం ప్రిన్సిపల్ కుప్పా శివ సుబ్రహ్మణ్యం అవధాని పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


అమ్మవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



అమ్మవారి ఆలయం వద్ద జస్టిస్ సంజయ్ కరోల్

తిరుచానూరు, ఆగస్టు 20(ఆంధ్ర జ్యోతి): పద్మావతి అమ్మవారిని బుధవారం రాత్రి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్‌కరోల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆయనను ఆలయ వేదపండితులు ఆశీర్వదించి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.5.30 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 76,033

తలనీలాలు సమర్పించినవారు: 26,905

స్విమ్స్‌లో పులివెందుల పెత్తనానికి ఈసారైనా బ్రేక్ పడేనా?

- మెడికల్ మాఫియాకి యంత్రాంగం అండ
- మూడుసార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకురాని వైనం
- నేడు నాలుగోసారి తెరవనున్న టెండరు



శ్రీపద్మావతి ఆస్పత్రి వద్ద మెడికల్ షాపు

పులివెందుల పెత్తనం నుంచి స్విమ్స్ ఇప్పటికీ బయటపడడంలేదు. కొందరు అధికారుల అండతో యథేచ్ఛగా వారి హవా కొనసాగుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో టీటీడీ అధీనంలోకి స్విమ్స్ వచ్చీ రాగానే రాజకీయ పెత్తనం పెరిగిపోయింది. జనరిక్ (జన ఔషధి)మెడికల్ షాపులు పేరిట అప్పటి టీటీడీ ఛైర్మన్లు వారి అనుచరులకు చెరొక మెడికల్ షాపులను కట్టబెట్టారన్న విమర్శలు వచ్చాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న జనరిక్ మెడికల్ షాపులను రద్దుచేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేసింది. ఎట్టకేలకు ఒక షాపును రద్దుచేయగలిగారు. అయితే స్విమ్స్‌కు అనుబంధంగా ఉన్న శ్రీపద్మావతి ఆస్పత్రి వద్ద పులివెందులకు చెందిన వ్యక్తుల చేతిలో ఉన్న మెడికల్ షాపును మాత్రం కదిలించలేకపోతున్నారు. కేవలం రూ.17వేల నామమాత్రపు అద్దెతోనే దీనిని కేటాయించారు. ప్రస్తుతం రూ.60వేలకు పెంచారు. దాదాపు నెలకు రూ.15లక్షలకు పైగా అద్దెవచ్చే అవకాశం ఉన్న షాపును నామమాత్రపు అద్దెతో కేటాయించడంపై మీడియాలో కథనాలు వచ్చిన నేపథ్యంలో ప్రస్తుతం టీటీడీ మూడు సార్లు టెండర్లు పిలిచింది. కానీ, టెండరులో పాల్గొనేందుకు ఎవరూ ముందుకురాలేదు. రూ.25లక్షల అద్దెతో పాటు రూ.25కోట్ల టర్నోవర్ ఉండాలని అసాధారణ నిబంధనలు పెట్టడంవల్లే ఎవరూ ముందుకు రాలేదన్న విమర్శలు ఉన్నాయి. పులివెందులకు చెందిన వైసీపీ బ్యాచ్‌కు అనుకూలంగా కొందరు అధికారులు ఉద్దేశ్యపూర్వకంగా అసాధారణ అంశాలు చేర్చడం వలనే టెండర్లలో పాల్గొనడానికి ఎవరూ ముందుకు రావడంలేదని టీటీడీ ఆలస్యంగా గ్రహించింది. ఈక్రమంలో టర్నోవర్‌ను మాత్రం రూ.25కోట్లు ఉంచి నెలవారి అద్దెను రూ.25లక్షల నుంచి రూ.15లక్షలకు తగ్గిస్తూ గతనెల 25వ తేదీ టీటీడీ నాలుగోసారి టెండరు నోటిఫికేషన్ ఆహ్వానించింది. నెలకు రూ.15లక్షల అద్దెతో టెండర్లలో పాల్గొనేందుకు ఆసక్తిచూపుతున్నారు కానీ రూ.25కోట్ల టర్నోవర్ నిబంధన అడ్డుగామారిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. తిరుపతిలో రెండు, మూడు రిటైల్ షాపులు మినహా తక్కిన షాపులవారికి రూ.25కోట్ల టర్నోవర్ ఉండడం అసాధ్యం. అందుకే తెలంగాణనుంచి పలువురు టెండర్లలో పాల్గొన్నట్టు తెలిసింది. కాగా బుధవారం టెండర్లు తెరవాల్సివుండగా గురువారానికి వాయిదా వేస్తున్నట్టు టీటీడీ రెవెన్యూ వర్గాలు తెలిపాయి. ఈసారైనా టెండరు విజయవంతమవుతుందో లేదో వేచిచూడాలి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

వచ్చేనెలలో బీవీఎస్సీ తరగతులు ప్రారంభం

తిరుపతి రూరల్, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): ఎస్వీవెటర్నరీ వర్సిటీ పరిధిలో యూజీ(బీవీఎస్సీ) కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. వర్సిటీకి అనుబంధంగా ఉన్న తిరుపతి, ప్రొద్దుటూరు, గన్నవరం, గరివిడి కళాశాలల్లో ఏపీ ఈఏపీసెట్ ర్యాంకు ప్రాతిపదికన అడ్మిషన్లు చేపడుతున్నారు. ఈఏపీసెట్ ద్వారా 85శాతం, వీసీఐ కోటా కింద(నీట్ ర్యాంకు ఆధారంగా)15శాతం సీట్లను భర్తీ చేస్తున్నారు. రైతు కోటా ద్వారా 25శాతం సీట్లను భర్తీ చేస్తున్నారు. స్థానికతకు సంబంధించి న్యాయస్థానంలో తీర్పు వెలువడిన నేపథ్యంలో సర్టిఫికెట్ల పరిశీలన ఈవారంలో పూర్తికానుందని వర్సిటీ డీన్ డాక్టర్ వీరబ్రహ్మయ్య తెలిపారు. కోర్సులో చేరేందుకు దాదాపు 6వేలమంది దరఖాస్తు చేశారు.

ఎన్నారై కోటాకు ప్రతిపాదన

వర్సిటీలో 13ఏళ్ల కిందట ఎన్నారై కోటా రద్దయింది. బోర్డు ఆదేశాల మేరకు ఈ కోటా పునరుద్ధరణకు అధికారులు తాజాగా ప్రతిపాదనలు పంపారు. తాద్వారా వర్సిటీలో 45సీట్లకు అవకాశముంటుంది. ప్రభుత్వం అనుమతిస్తే ఈసీట్ల ద్వారా ఏడాదికి దాదాపు రూ.కోటి వరకు అదనపు ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నారు. కాగా ఈఏపీసెట్ ర్యాంకు ఆధారంగా ఒక్కో కళాశాలలో 70సీట్లు ఉన్నాయి. ఐదున్నరేళ్లలో నాలుగున్నరేళ్ల కళాశాలలో విద్యాబోధన సాగుతుంది. ఏడాదిపాటు ఇంటర్న్‌షిప్ పీరియడ్‌లో క్షేత్రస్థాయిలో పశువైద్య ఆసుపత్రుల్లో పనిచేయాలి.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండు



ప్రొఫెసర్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య

బీవీఎస్సీ కోర్సులు చదివిన వారికి వివిధరంగాలలో మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. పశుసంవర్ధకశాఖలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్(వీఏఎస్), పౌల్ట్రీ, డెయిరీ, ఫార్మాస్యూటికల్ సంస్థల్లో అవకాశాలు ఉన్నాయి. ప్రైవేట్ ప్రాక్టీస్ ద్వారా ఉపాధి. ఆలిండియా స్థాయిలో వెటర్నరీ ప్రాక్టీస్‌గా పనిచేయొచ్చు. ప్రత్యేకించి విదేశాలల్లో వెటర్నేరియన్స్‌కి డిమాండ్ ఉంది. ప్రతిష్టాత్మక యూపీఎస్సీ ఏపీపీఎస్సీలలో రాణించేందుకు వెటర్నరీవిద్య దోహదం చేస్తుంది.

- డాక్టర్ వీరబ్రహ్మయ్య, వెటర్నరీ డీన్

55 ఏళ్ల భూవివాదానికి పరిష్కారం

- అటవీశాఖకు భూములు తిరిగి అప్పగింత
- బాధిత రైతులకు మరోచోట పట్టాలిచ్చేందుకు ఒప్పందం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఇనగలూరు రెవెన్యూ పరిధిలోని సింహాచలకండ్రిగ, గొల్లపల్లి పంచాయతీల్లో 55 ఏళ్ల అటవీ భూముల వివాదం ఎట్టకేలకు పరిష్కారమైంది. అక్కడి రైతులతో జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, అటవీశాఖ, రెవెన్యూశాఖ అధికారులు, సింహాచలకండ్రిగ రైతులతో బుధవారం పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథిగృహంలో సుదీర్ఘ చర్చలు జరిపారు. చర్చల వివరాలను విలేకరుల సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. 1970లో అప్పటి ప్రభుత్వం 130 ఎకరాలకు సంబంధించి రైతులకు పట్టాలు పంపిణీ చేసిందన్నారు. అయితే ఈ భూమి రిజర్వు ఫారెస్టు కావడంతో 1978లో అప్పటి కలెక్టర్ రద్దు చేశారన్నారు. తరువాత 1998లో 98 కుటుంబాలకు 130 ఎకరాల భూమి పంపిణీ చేస్తూ పట్టాలు జారీచేశారన్నారు. 2008లో అటవీశాఖ అధికారులు మళ్లీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. ఈక్రమంలో 2014లో న్యాయస్థానం ఈ భూములను అటవీశాఖవిగా గుర్తించి పట్టాలను రద్దు చేసినట్లు వివరించారు. ఇలా 55 ఏళ్లుగా అటవీశాఖ, సింహాచల కండ్రిగ గ్రామస్థుల మధ్య వివాదం నలుగుతూనే ఉందన్నారు. ఈ సమస్య పరిష్కారంపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి విజ్ఞప్తితో తాను వచ్చి రెవెన్యూ, అటవీశాఖ, రైతుల సమక్షంలో చర్చించినట్లు తెలిపారు. అటవీ భూములను తిరిగి ఆ శాఖకు అప్పగించి బాధిత రైతులకు సమీప ప్రాంతంలో సాగుకు అనువైన భూములను కేటాయిస్తామన్నారు. వీటికి పట్టాలు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. అటవీశాఖ స్వాధీనం చేసుకుంటున్న భూమిలో నీలగిరి తైలం మొక్కలను పెంచి వనసంరక్షణ కమిటీ ఏర్పాటు ద్వారా రైతులకు ప్రతి మూడు, నాలుగేళ్లకోసారి రూ.20వేల నుంచి రూ.50వేల వరకు స్థిరమైన ఆదాయం కల్పించేలా కార్యాచరణ రూపొందించామన్నారు. ఈ నిర్ణయాలకు రైతులు అంగీకరించి హర్షం వ్యక్తం చేశారన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ సింహాచలకండ్రిగతో పాటు బీవీపురం, గొల్లపల్లి గ్రామాల్లో నెలకొన్న 1,150 ఎకరాలకు సంబంధించి భూవివాదాన్ని కూడా త్వరలో పరిష్కరిస్తామన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జిల్లా అటవీశాఖ అధికారి వివేక్, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హర్షం వ్యక్తంచేస్తున్న రైతులు

తిరుపతిలో 'అమరావతి చాంపియన్ షిప్'

- ఈ నెల 24, 25, 26వ తేదీల్లో నిర్వహణ
- శాప్ ఛైర్మన్ రవినాయుడు

తిరుపతి (క్రీడలు), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో "అమరావతి చాంపియన్ షిప్-2025" పేరుతో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. ఈ నెల 29న జరగనున్న నేషనల్ స్పోర్ట్స్ డేలో భాగంగా రాష్ట్రస్థాయి పోటీలకు తిరుపతి ఆతిథ్యమిస్తుందని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 24, 25, 26వ తేదీల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా పోటీలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. రాష్ట్రస్థాయిలో హాకీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్ బాల్, ఖోఖో, కబడ్డీ, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్, ఆర్చరీ పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ పోటీల్లో రెండు వేల మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 29వ తేదీన విశాఖపట్నంలో జరిగే నేషనల్ స్పోర్ట్స్ డేకు సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీల విజేతలకు నగదు ప్రోత్సాహకాలు, పతకాలు అందజేస్తారని రవినాయుడు స్పష్టం చేశారు.



పేకాట ఆడుతున్న జూదరులు

డ్రోన్‌కు చిక్కిన జూదరులు

- 11మంది అరెస్టు.. 9 మంది పరారీ
- రూ.2,36,740, 12సెల్‌ఫోన్లు, 4 బైక్‌లు స్వాధీనం

ఏర్పేడు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కింద పట్ట పరిచారు. ఒక పక్క పరదా కట్టారు. ఇలా రోడ్డుకు దూరంగా పొలాల్లో పేకాట స్థావరం పెట్టారు. ఎక్కడో పొలాల్లో ఉన్న తమను ఎవరు పట్టుకుంటారులే అని ధీమాగా పేకాట ఆడుతున్న వారు.. ఆకాశం నుంచి నిఘా పెట్టిన డ్రోన్‌కు చిక్కారు. ఏర్పేడు మండలం మేర్లపాక, బండారుపల్లి, ముసలిపేడు, కందాడు, రామలింగాపురం గ్రామాల్లో డ్రోన్ ద్వారా పోలీసు బీట్ పెట్టారు. సైబర్ క్రైం సీఐ, డ్రోన్ కెమెరాల ఇన్‌ఛార్జి వినోద్‌కుమార్ పర్యవేక్షణలో పది మంది పోలీసులు పేకాట స్థావరాలపై డ్రోన్ నిఘా పెట్టారు. బండారుపల్లి, ముసలిపేడు సరిహద్దు పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు గుర్తించారు. పేకాట ఆడుతున్న మూడు ప్రాంతాలపై దాడులు నిర్వహించి 11మందిని అదుపులోకి తీసుకున్నారు. మరో 9మంది పరారయ్యారు. పేకాట స్థావరాల నుంచి రూ.2,36,740 నగదు, 12 సెల్‌ఫోన్లు, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో తిరుపతికి చెందిన ఇద్దరు, కడపకు చెందిన ఐదుగురు, అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన ఇద్దరు, కోడూరుకు చెందిన ఒకరు, కలకడకు చెందిన ఒకరు చొప్పున ఉన్నారు. వీరిని ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

డిసెంబరులోగా కొత్త భవనం అప్పగించండి

- రైల్వే జీఎం సంజయ్ కుమార్ ఆదేశం



రైల్వేస్టేషన్ భవన నిర్మాణాలను పరిశీలించి సూచనలిస్తున్న జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల్లో భాగంగా దక్షిణం వైపు నిర్మిస్తున్న భవనాన్ని ఈ ఏడాది డిసెంబరులో అప్పగించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజరు సంజయ్ కుమార్ శ్రీవాత్సవ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన రైల్వేస్టేషన్‌లో చేపట్టిన నిర్మాణాల ప్రణాళికను పవర్ ప్రజెంటేషన్ ద్వారా తిలకించారు. అనంతరం అధికారులతో సమీక్షించాక సాధారణ ప్రయాణికుల విశ్రాంతి గదుల్లో సదుపాయాల కల్పనపై ఆరా తీశారు. నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా నిర్మాణాలను అప్పగించేలా పనులు వేగవంతం చేయాలన్నారు. గుంతకల్లు డివిజన్ మేనేజరు చంద్రశేఖర్ గుప్తా, జోనల్ సీఈ సూర్యనారాయణ, కార్యదర్శి మల్లాడి శ్రీనివాస్, సీనియర్ స్కేల్ అధికారులు సుదర్శన్‌రెడ్డి, మణికంఠ, మనోజ్, శ్రావణ్ కుమార్, సూర్యనారాయణ, తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్ఎంఆర్ కె.చిన్నప్పరెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా జీఎంను రాజస్థానీ బ్రాహ్మణ్ మహాసభ నాయకులు కలిశారు. తిరుపతి-బికనీర్‌ల మధ్య రెగ్యులర్ ఎక్స్‌ప్రెస్ రైలును నడపాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించాలని రైల్వే కూలీలు వినతి పత్రం సమర్పించారు. డీఆర్‌ఎంతో జీఎం మాట్లాడి వారి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకున్న ఆయనకు స్టేషన్ అభివృద్ధి పనుల గురించి అధికారులు వివరించారు. అనంతరం ఆయన ప్రత్యేక కోచ్‌లో సికింద్రాబాద్ బయలుదేరి వెళ్లారు. అంతకుముందు ఉదయం రైల్వేజీఎం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

ఆర్టీసీ బస్సులు ఫుల్

- ఫుట్‌పాత్ మీద ప్రమాదం అంచున ప్రయాణాలు



బస్సు వెలుపల రద్దీ



బస్సులోపల రద్దీ

పుత్తూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకంతో పల్లెవెలుగు బస్సులన్నీ లోపల బయటా నిండిపోతున్నాయి. ఫుట్‌పాత్ ప్రయాణంతో ప్రమాదం అంచున నడుస్తున్నాయి. ప్రత్యేకించి కళాశాలలు, కార్యాలయాల ముగింపు వేళల్లో అదుపు చేయలేని రద్దీతో బస్సులు కదులుతున్నాయి. సత్యవేడు, నగరి, చిత్తూరు మార్గాల్లో గతంలో ఆటోల్లో వెళ్లే మహిళలు ఇప్పుడు ఓపికతో వేచి వుండి పల్లెవెలుగు బస్సులు ఎక్కుతున్నారు. రోజురోజుకూ ఆక్యుపెన్సీ రేటు పెరుగుతోందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆయా రూట్లలో అదనపు సర్వీసులను నడపాలని మహిళలు కోరుతున్నారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం



బోడేవాండ్ల పల్లెవద్ద పట్టుబడిన వాహనాలతో పాటు ఎర్రచందనం

ఎర్రావారిపాలెం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): బోడేవాండ్లపల్లెవద్ద ఎర్రచందనం స్వాధీనం చేసుకొన్నట్లు భాకరాపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా.. బోడేవాండ్లపల్లెవద్ద టీ జంక్షన్ వద్ద బుధవారం వేకువజామున ఓ ద్విచక్ర వాహనం, దాని వెనుక వ్యాను అతివేగంగా వెళ్లడం ఫారెస్ట్ సిబ్బంది గమనించారు. వెంటనే నిలువరించేందుకు వేగంగా వెంబడించారు. దీంతో నిందితులు తమ వాహనాలను రోడ్డుపై నిలిపి పరారయ్యారు. సిబ్బంది వాహనాలను పరిశీలించగా 395 కేజీల బరువు గల 10 ఎర్రచందనం దుంగలున్నాయి. వాహనాలతో దుంగలను స్వాధీనం చేసుకున్నారు.

'పుష్పిత్ స్టీల్స్'లో కార్మికుడి మృతి

- కర్మాగారం ఎదుట మృతుడి బంధువుల ధర్నా



పరిశ్రమ వద్ద బంధువుల ధర్నా



మహేష్ ఫైల్ ఫొటో

ఏర్పేడు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం మేర్లపాక పంచాయతీలోని 'పుష్పిత్ స్టీల్స్'లో మెకానిక్‌గా పనిచేస్తున్న మేర్లపాక వాసి మహేష్(45) బుధవారం మృతిచెందారు. విధినిర్వహణలో ఉన్న ఆయన సొమ్మసిల్లి పడిపోవడంతో హుటాహుటిన కంపెనీ వాహనంలో తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు యాజమాన్యం తెలిపింది. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, తీవ్ర పని ఒత్తిడి వల్లే కర్మాగారం లోపలే మహేష్ చనిపోయాడని, బతికి ఉన్నట్లు ఆస్పత్రికి తీసుకెళ్లి యాజమాన్యం నాటకాలు ఆడారని ఆయన బంధువులు ఆరోపిస్తున్నారు. కర్మాగారంలోని పెద్ద కీలన్‌పైకి బలవంతంగా ఎక్కించారని, అక్కడ ఆయన చనిపోయినట్లు వారు చెబుతున్నారు. ఈ క్రమంలో న్యాయం కావాలని, మహేష్ మృతికి కారణమైన యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ మృతదేహంతో పుష్పిత్ స్టీల్స్ ఎదుట బంధువులు, గ్రామస్థులు ధర్నా చేశారు. మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించి భద్రత కల్పించాలని కోరారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నర్సింగ్ అభ్యర్థులకు జర్మన్ భాషపై శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ నర్సింగ్ అభ్యర్థులకు శుక్రవారం నుంచి జర్మన్ భాషపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. సాంఘిక, గిరిజన సంక్షేమ, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతిలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఈ శిక్షణ ఉంటుందని ఎస్సీ సంక్షేమ శాఖ సాధికారత అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఉచిత వసతితోపాటు శిక్షణ ఇస్తారని వివరించారు. ప్రారంభ కార్యక్రమంలో మంత్రి బాలా వీరాంజనేయస్వామి పాల్గొంటారన్నారు.

విద్యుత్ స్తంభాలకు అనధికార కేబుల్స్ తొలగించండి

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంతోపాటు టౌన్ డివిజన్ పరిధిలోని విద్యుత్ స్థంభాలకు అనధికారంగా వున్న కేబుల్ వైర్లను తొలగించాలని లేదంటే తమ సిబ్బంది శనివారం నుంచి తొలగిస్తారని సదరన్ డిస్కం ఈఈ వి.చంద్రశేఖర్ రావు బుధవారం స్పష్టంచేశారు. విద్యుత్ సంత్ంభాలకు ఇబ్బడి ముబ్బడిగా అనధికార కేబుల్ వైర్లు ఉండటం వల్ల అగ్ని ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు మార్లు కేబుల్ ఆపరేటర్లుకు వైర్లు తొలగించాలని కోరామన్నారు. అయినా వారి నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. ప్రజల ప్రాణాలు కాపాడటానికి కఠినమైన నిర్ణయాలు తీసుకొంటున్నామని వెల్లడించారు. వినాయకచవితి మండపాల నిర్వాహకులు రుసుం చెల్లించి తాత్కాలిక విద్యుత్ సర్వీసులను పొందాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్ఈపీతో సత్వర అభివృద్ధి

- హెచ్‌సీయూ మాజీ వీసీ పొదిలి అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) - 2020 అమలుతో దేశం సత్వర అభివృద్ధి సాధిస్తుందని హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ పొదిలి అప్పారావు పేర్కొన్నారు. ఐదేళ్ల ఎన్ఈపీ అమలు - ప్రగతి అంశంపై అఖిల భారతీయ శిక్షక్ మహా సంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) ఆధ్వర్యంలో ఎస్వీయూ సెనేట్ హాల్లో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. 37 ఏళ్లుగా దేశ విద్యా విధానంలో ఎలాంటి మార్పులూ తీసుకురాలేదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం పెరిగిన నేపథ్యంలో మార్పులు అవసరమని కేంద్ర ప్రభుత్వం భావించిందన్నారు. ప్రభుత్వ రంగంలోనే కాకుండా ఐటీ, ఫార్మా, అగ్రి, డెయిరీ వంటి రంగాల్లో స్వయం ఉపాధిని కల్పించేలా అనేక నూతన కోర్సులు ప్రవేశ పెట్టినట్టు చెప్పారు. ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు మాట్లాడుతూ దేశంలో కేజీ నుంచీ పీజీ దాకా ఎన్ఈపీ పటిష్టంగా అమలు అవుతుందన్నారు.తద్వారా విద్యా రంగంలో మంచి ఫలితాలు సాధించినట్టు తెలిపారు. ఏబీఆర్ఎస్ఎం జాతీయ అధ్యక్షుడు గుంతా లక్ష్మణ్ మాట్లాడుతూ చైనా, జపాన్, జర్మనీ దేశాల్లో ప్రాథమిక దశ నుంచి ఉన్నత విద్య వరకూ అంతా మాతృభాషలోనే విద్య అందిస్తున్నారని,మన దేశంలోనూ ఇదే తరహా బోధన అందించే అవకాశాన్ని ఎన్ఈపీ కల్గించిందని అన్నారు. విద్యకు బడ్జెట్‌లో 6 శాతం నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రామిరెడ్డి, ఉపాధ్యక్షురాలు వాణి, విద్యావేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- డెప్యుటేషన్‌పై వెటర్నరీ వర్సిటీకి

వెంకటగిరి పశువైద్య ఏడీ బదిలీ

తిరుపతి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎంవీ స్వామిబాబు డెప్యుటేషన్‌పై తిరుపతి ఎస్వీ వెటర్నరీ వర్శిటీకి బదిలీ అయ్యారు. ఇక్కడ ఏడాదిపాటు ఆయన కొనసాగనున్నారు. వర్శిటీ పరిధిలోని సెంటర్ ఫర్ కంటిన్యూయింగ్ వెటర్నరీ ఎడ్యుకేషన్‌లో గానీ లేదా తిరుపతిలోని వర్శిటీ ప్రధాన కార్యాలయంలో టెక్నికల్ ఆఫీసర్‌గా గానీ ఆయన సేవలు వినియోగించుకోవాలని ప్రభుత్వం వర్శిటీ రిజిస్ట్రార్‌ను ఆదేశించింది.

మరో 24 మందికి టీడీఆర్ బాండ్లు

తిరుపతి, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాలు కోల్పోయిన 24 మందికి టీడీఆర్ బాండ్లను బుధవారం తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అందజేశారు. నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్లు ఏర్పాటులో స్థలాలు కోల్పోయిన వారికి పారదర్శకంగా బాండ్లు పంపిణీ చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామన్నారు. ఇందులో అందరి దరఖాస్తులు పరిశీలించి ఆన్‌లైన్ చేశామని తెలిపారు. పలుమార్లు టీడీఆర్ కమిటీ సభ్యులు ఆన్‌లైన్ ద్వారా సమావేశమై అన్ని పత్రాలు సక్రమంగా ఉన్న వారిని గుర్తించామన్నారు. ఈ ప్రక్రియలో ఇప్పటి వరకు 267 మందికి టీడీఆర్ బాండ్లు పంపిణీ చేశామన్నారు. కాగా బుధవారం ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన కమిటీ సమావేశంతో పాటు అన్ని పత్రాలను పరిశీలించి ఎంపిక చేశామని అన్నారు. డీసీపీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకూ హ్యాప్రీ బస్!

ఏటా 25 లక్షల మంది మహిళలకు లబ్ది

ప్రభుత్వంపై రూ.23 కోట్ల అదనపు భారం

త్వరలో మార్గదర్శకాలు జారీ అయ్యే అవకాశం

తిరుపతి-తిరుమల నడుమ కూడా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఉచితం చేస్తామని ఆ సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు చేసిన ప్రకటన మహిళా యాత్రికులను మహదానందానికి గురిచేస్తోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి ఉచితంగానే తిరుపతికి చేరుకున్నా తిరుమలకు మాత్రం చార్జీలు చెల్లించాల్సిరావడం వీరిని అసంతృప్తికి గురిచేసింది. తాజా నిర్ణయం అమలు తేదీ కోసం వీరంతా ఎదురు చూస్తున్నారు. నిజానికి తిరుమలకు ఉచితం చేయడం వల్ల ఆర్టీసీ మీద పడే భారం కూడా ఏమంత ఎక్కువ కాదు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

స్త్రీ శక్తి పథకాన్ని అమలు చేస్తే ఏటా పాతిక లక్షల మందికి పైగా మహిళా ప్రయాణికులకు లబ్ధి చేకూరనుంది. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వంపై అదనంగా రూ.23 కోట్ల వరకూ భారం పడనుంది. ఈనెల 15వ తేదీ నుంచీ రాష్ట్రవ్యాప్తంగా నిర్ణీత ఆర్టీసీ బస్సుల్లో ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. అయితే తిరుపతి-తిరుమల మధ్య నడిచే ఆర్టీసీ బస్సుల్లో మాత్రం మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం వర్తించదని ప్రకటించిడం తెలిసిందే. దీనిపై వివిధ వర్గాల నుంచీ వచ్చిన విన్నపాలు, సలహాలు, సూచనలతో ప్రభుత్వం పునరాలోచనలో పడింది. దీంతో తిరుపతి-తిరుమల నడుమ మహిళా ప్రయాణికులకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని వర్తింపజేయాలని ప్రాథమికంగా నిర్ణయానికి వచ్చినట్టు మంగళవారం ఆర్టీసీ చైర్మన్ ప్రకటించారు. ఆ నిర్ణయం అమల్లోకి వస్తే ప్రభుత్వంపై రూ. 23 కోట్లు అదనపు భారం పడనున్నప్పటికీ ప్రభుత్వం సంతోషంగానే దానికి సిద్ధపడుతున్నట్టు సమాచారం.



ఏటా పాతిక లక్షల మందికి ప్రయోజనం

ప్రస్తుతం తిరుపతి-తిరుమల నడుమ 298 డీజిల్ బస్సులు, 64 ఏసీ సదుపాయంతో కూడిన ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి. వీటిలో ఏసీ కలిగిన ఎలక్ట్రిక్ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి అవకాశం లేదు. మిగిలిన బస్సులు తిరుపతి-తిరుమల నడుమ రోజుకు 1160 ట్రిప్పులు (రానుపోను కలిపి ఒక ట్రిప్పు) తిరుగుతున్నాయి. వీటిల్లో రోజుకు 45 వేల మంది తిరుమల- తిరుపతి నడుమ ప్రయాణిస్తున్నారు. వీరిలో 35 శాతం మంది మహిళలు. అంటే 13,500 మంది ఆడవాళ్లు . వీరిలోనూ తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు వారు పెద్ద సంఖ్యలోనే ఉంటారు. ఇక ఏపీకి చెందిన మహిళా ప్రయాణీకల సంఖ్య సగటున ఒక ట్రిప్పుకు 6 మంది చొప్పున ఉంటారని అంచనా. ఆ లెక్కన రోజుకు సుమారు 7 వేల మంది ఏపీ మహిళలు రాకపోకలు సాగిస్తున్నారు. నెలకు 2.10 లక్షల మంది, ఏడాదికి 23 లక్షల మంది వంతున కొండకు వెళ్ళి వస్తున్నట్టు ఆర్టీసీ అంచనాలు చెబుతున్నాయి. అయితే వీరిలో భక్తులే కాకుండా టీటీడీలో పనిచేస్తున్న వివిధ కేటగిరీల ఉద్యోగులు, చిరు వ్యాపారులు, కూలీలు సైతం వున్నారు.

రూ.180 మిగులుతుంది

తిరుపతి-తిరుమల నడుమ దూరం 24 కిలోమీటర్లు. ఆర్టీసీ డీజిల్ బస్సుల్లో చార్జీ ఒక వైపునకు రూ.90 అంటే ఒక మహిళకు తిరుమలకు వెళ్లిరావడానికి 180 రూపాయలు ఖర్చవుతుంది. దీన్ని ఉచితం చేయడం వల్ల కుటుంబాలతో తిరుమల కొండకు వచ్చేవారికి ఎంతో ఉపశమనం కలుగుతుంది. అయితే తిరుమలకు ఉచితం చేస్తే ఆర్టీసీ మీద పడే భారం ఏడాదికి రూ. 23 కోట్లు. ఇది మోయలేనంత భారం కాదు. భక్తుల్లో సంతోషం నింపడానికి ఇది కారణం అవుతుంది. ఇవన్నీ పరిశీలించిన తర్వాతే ప్రభుత్వం ఉచిత నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. అయితే అధికారికంగా ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది.

చిత్తూరు జిల్లాలో 2 లక్షల మంది ప్రయాణం

చిత్తూరు రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలో స్త్రీ శక్తి పథకం ద్వారా మంగళవారం దాకా ఆర్టీసీ బస్సుల్లో 2.15 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించినట్లు డీపీటీవో రాము ఒక ప్రకటనలో తెలిపారు. దీని ద్వారా రూ.94.03 లక్షలు ఆదా చేసుకున్నారన్నారు. ఉచిత ప్రయాణం చేసే మహిళలు పెరుగుతుండడంతో అన్ని రూట్లలో బస్సులను పెంచామని, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నామని ఆయన తెలిపారు.

దోమలను నియంత్రిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది



దోమల నియంత్రణతోనే వ్యాధులకు చెక్

చిత్తూరు అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దోమలను నియంత్రణతోనే వ్యాధులను కట్టడి చేయవచ్చని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకట ప్రసాద్ చెప్పారు. ప్రపంచ దోమల దినాన్ని పురస్కరించుకుని ఇన్‌చార్జి కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఎంహెచ్‌వో లోకేష్‌తో కలిసి 8వ వార్డులోని వెంగళ రావు కాలనీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రమాదకర విష జ్వరాలు చాలావరకు దోమకాటుతో వ్యాపిస్తాయన్నారు. ఇన్‌చార్జి కమిషనర్ మాట్లాడుతూ.. దోమల నియంత్రణకు ఫాగింగ్, మలాథియాన్ స్ప్రేయింగ్, నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేయడం వంటి పనులు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మేజర్ కాలువల్లో ఆయిల్‌బాల్స్ వేసి స్ప్రేయింగ్ చేశారు. దోమల నియంత్రణపై కరపత్రాలను పంపిణీ చేశాక ప్రతిజ్ఞ చేశారు. డీఎంవో వేణుగోపాల్, అర్బన్ హెల్త్ వైద్యాధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వార్డు కార్యదర్శులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్లలో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

డీఐఈవో రఘుపతి



చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ అడ్మిషన్లలో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి (డీఐఈవో) రఘుపతి హెచ్చరించారు. బుధవారం తన చాంబర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. గత ఏడాది ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో 13,202 అడ్మిషన్ల, ఈసారి 15,012 అడ్మిషన్లు జరిగాయన్నారు. 31 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 3,970 అడ్మిషన్లు జరగ్గా, 98 ప్రైవేటు, హైస్కూల్ ప్లస్, కేజీబీవీ, మోడల్ స్కూల్, వెల్ఫేర్ జూనియర్ కళాశాలల్లో 11,042 అడ్మిషన్లు జరిగాయన్నారు. అడ్మిషన్ల ప్రక్రియ ఈనెల 11వ తేదీనాటికి పూర్తయినట్లు తెలిపారు. ఈ క్రమంలో పలమనేరు, చౌడేపల్లె, జిల్లా కేంద్రంలోని పలు జూనియర్ కళాశాలలను తనిఖీ చేశామన్నారు. నిబంధనలు ఉల్లంఘించి, అనుమతులకు మించి అడ్మిషన్లు చేసి విద్యార్థుల జీవితాలతో ఆడుకునే జూనియర్ కళాశాలలపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. కాగా, జిల్లాలో జీరో అడ్మిషన్లు జోన్‌గా 25 జూనియర్ కళాశాలను గుర్తించగా, మరో ఐదు జూనియర్ కళాశాలలు మూసివేతలో ఉన్నాయని చెప్పారు. ఈ కళాశాలల పేరిట ఎవ్వరూ అడ్మిషన్లు చేయరాదన్నారు.

వేతన సంఘం ఏర్పాటు చేయండి

పోస్టల్ ఉద్యోగుల ధర్నా



హెడ్ పోస్టాఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

చిత్తూరు రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు హెడ్ పోస్టాఫీస్ ఎదుట బుధవారం పోస్టల్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ పిలుపుతో జరిగిన ఈ ధర్నాలో పలువురు నాయకులు ప్రసంగించారు. ఎనిమిదో వేతన సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా తమ డిమాండ్ పరిష్కరించకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సంఘ నాయకులు భాస్కర్, రామ మూర్తి, మహదేవన్, దామోదరం పాల్గొన్నారు.

నకిలీ బంగారంతో టోకరా

బాధితుడి ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన వైనం

వెదురుకుప్పం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నకిలీ బంగారంతో ఓ వ్యక్తి మోసపోయాడు. బాధితుడి ఫిర్యాదుతో ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ హనుమంతప్ప తెలిపిన వివరాల మేరకు.. కార్వేటినగరం మండలం కొటార్వేడు కాలనీకి చెందిన ఏడీ రాజేష్ కార్వేటినగరంలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. కార్వేటినగరంలో ఈ ఏడాది మేలో జరిగిన బ్రహ్మోత్సవాలకు బ్యాండు మేళం వాయించడానికి రాజమండ్రి నుంచి వంశీ అనే వ్యక్తి వచ్చాడు. ఇతను ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కి వెళుతూ రాజేష్‌ను పరిచయం చేసుకుని.. ఫోన్ నెంబరు కూడా తీసుకున్నాడు. తన వద్ద బంగారం ఉందని, రూ.3లక్షలు అవసరమని నమ్మించి నకిలీ బంగారాన్ని రాజేష్‌కు ఇచ్చి డబ్బులు తీసుకున్నాడు. ఇటీవల వంశీ ఇచ్చిన బంగారాన్ని పరీక్షించడంతో నకిలీ బంగారం అని బాధితుడు గుర్తించారు. ఈ విషయమై బుధవారం కార్వేటినగరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి కేసులో నిందితులకు బెయిల్

చిత్తూరు అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యంలో జరిగిన మాజీ సీఎం జగన్ పర్యటనలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడి చేసి.. జైలు పాలైన వైసీపీ కార్యకర్తలు చక్రవర్తి, వినోద్, మోహన్, శంకరాచారిలకు సోమవారం మొదటి అదనపు జిల్లా కోర్టులో న్యాయమూర్తి రమేష్ బెయిల్ మంజూరు చేశారు. మంగళవారం పీడీఎం కోర్టులో న్యాయమూర్తి వద్ద జామీనుదారులను హాజరుపరిచారు. దాంతో వీరిని సాయంత్రం విడుదల చేశారు.

ఒక ఇంట్లోని ఓటర్లంతా ఒకే డోర్ నెంబరులో ఉండాలి

డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ



సమావేశంలో ప్రసంగిస్తున్న డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ

గంగాధరనెల్లూరు, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): ఒక ఇంట్లోని ఓటర్లంతా ఒకే డోర్ నెంబరులో ఉండాలని డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ ఆదేశించారు. ఓటర్ల జాబితాపై గంగాధరనెల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతలు, అధికారులతో బుధవారం ఆయన సమీక్షించారు. తప్పుల్లేని ఓటరు జాబితా తయారీకి బీఎల్వోలకు రాజకీయపార్టీల నేతలు, ఓటర్లు సహకరించాలని కోరారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీకి సంబంధించి ప్రతి పోలింగ్ కేంద్రానికి వారి తరపున బూత్‌లెవల్ ఏజెంట్లను నియమించుకోవచ్చని చెప్పారు. అందుకుగాను ఆ పార్టీలకు చెందిన అధ్యక్షులు వివరాలను గంగాధరనెల్లూరులో ఎన్నికల డీటీకి, లేదంటే ఆయా తహసీల్దార్లకు అందజేయాలని సూచించారు. తహసీల్దార్లు శ్రీనివాసులు, లోకనాథపిళ్ళై, బాబు, అరుణకుమారి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వరి, టీడీపీనేతలు స్వామిదాస్, దేవసుందరం, బీజేపీనేత ఇడగట్టి సుధాకర్, వైసీపీనేతలు వెంకటరెడ్డి, మణి, బట్టుజంగనపల్లె వెంకటేష్, కాంగ్రెస్ నేత గోవర్ధన్‌రెడ్డి, బీఎస్పీ నేతలు హరిబాబు, మురుగేషన్ పాల్గొన్నారు.





జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న అధికారులతో ఎమ్మెల్యే మురళీ మోహన్ - హాజరైన అభ్యర్థులు, కంపెనీల ప్రతినిధులు

జాబ్‌మేళాకు భారీ స్పందన

పూతలపట్టు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ నిర్మూలనే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. పూతలపట్టు మండలం పేటమిట్ట అమరరాజ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాను అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని యువత భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రానికి వివిధ కంపెనీలను తీసుకొచ్చేందుకు కృషిచేస్తూనే మరోవైపు జాబ్‌మేళాలతో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్య, నైపుణ్యానికి తగిన ఉద్యోగం ఇవ్వాలని కంపెనీల ప్రతినిధులను కోరారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గుణభూషణ్ రెడ్డి, పూతలపట్టు నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ టీడీపీ కోఆర్డినేటర్ గిరిధర్ బాబు, బంగారుపాళ్యం, తవణంపల్లె మండలాల టీడీపీ అధ్యక్షులు ఎన్‌పీ ధరణి నాయుడు, వెంకటేష్ చౌదరి, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ డైరక్టర్ గురుస్వామి, స్థానిక సర్పంచ్ గల్లా రాధాకృష్ణమ నాయుడు, బాబ్జీ నాయుడితోపాటు 23 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా జలాలతో కుప్పం సస్యశ్యామలం



పరమసముద్రం వద్ద కలెక్టరుతో మాట్లాడుతున్న రైతులు

కుప్పం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గం మొత్తం హంద్రీ-నీవా జలాలతో సస్యశ్యామలం కానుందని కలెక్టర్ సుమిత్ కుమార్ చెప్పారు.శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లె సమీపంలో సాగుతున్న కాలువతోపాటు హంద్రీ-నీవా అంతిమ స్థానమైన కుప్పం మండలంలోని పరమసముద్రం చెరువును బుధవారం ఆయన పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హంద్రీ-నీవా జలాలతో కుప్పం నియోజకవర్గంలోని 430 చెరువులు నింపుతామన్నారు. ఈ నేపథ్యంలో చెరువుల సామర్థ్యం పెంచడంతో పాటు చెక్ డ్యామ్‌లకు మరమ్మతులు చేసి నీటి నిల్వలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు.ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి పరమసముద్రం చెరువు వద్ద హంద్రీ-నీవా జలాలకు హారతి ఇవ్వడంతో పాటు పైలాన్‌ను ఆవిష్కరిస్తారన్నారు. హంద్రీ-నీవా ప్రాజెక్టు ఎస్ఈ విఠల్ ప్రసాద్, డీఈఈ కె.గోవర్ధన గిరిధరరావు, రిత్విక్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.రామచంద్రారెడ్డి తదితరులు ఆయన వెంట వున్నారు.

భూముల పరిహారం ఇప్పించాలన్న రైతులు

గుడుపల్లె, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): హంద్రీ నీవా కాలువల కోసం భూములిచ్చి 10 సంవత్సరాలు గడుస్తున్నా పరిహారం ఇంతవరకు అందలేదని సిరిగిరిపల్లె, ఒంటిపల్లె రైతులు కలెక్టరు సుమిత్‌కుమార్ దృష్టికి తెచ్చారు. పరమసముద్రం చెరువు వద్దకు కలెక్టరు వచ్చారని తెలుసుకొన్న రైతులు ఆయన వద్దకు వచ్చి తమ గోడును వెళ్లబోసుకొన్నారు.సిరిగిరిపల్లె, ఒంటిపల్లె రెవెన్యూ గ్రామాల్లో వున్న కాడేపల్లెవాసుల భూములు ఇచ్చామన్నారు.తమలో కొందరికి పరిహారం రాగా 10 మందికి మాత్రం అందలేదన్నారు.పరిహారం అందించి ఆదుకోవాలని కలెక్టరుకు వినతి పత్రం అందించారు. త్వరలోనే పరిహారం అందిస్తామని రైతులకు కలెక్టరు భరోసా ఇచ్చారు.

మార్గదర్శిగా తిరుపతి కమిషనర్

● 7 బంగారు కుటుంబాల దత్తత



బంగారు కుటుంబాలతో కమిషనర్ మౌర్య

తిరుపతి, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): ఏడు బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడం ద్వారా తిరుపతి నగరపాలక సంస్థ కమిషనరు ఎన్.మౌర్య 'మార్గదర్శి'గా మారారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ-4 కార్యక్రమం కింద నగరంలో పేదరికం నిర్మూలనకు ఆమె ముందుకొచ్చారు. ఆ బంగారు కుటుంబాల సభ్యులు బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వీరి ఆర్థిక స్థితిగతులు మెరుగుపడేందుకు, ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాల్లో పునాదులు ఏర్పడేందుకు, అవసరమైన మౌలిక సదుపాయాలను అందిస్తామని కమిషనరు హామీ ఇచ్చారు. తల్లిదండ్రులు లేని చిన్నారికి, తండ్రి లేని ఇద్దరు పిల్లలకు, తండ్రి లేని మరో బాలికకు విద్యను అందిస్తానని హామీ ఇచ్చారు. ఓ కుటుంబానికి ఇల్లు ఇప్పిస్తానని, జీవనోపాధి కోసం ఒకరికి తోపుడు బండి, కిరాణా షాపు పెట్టుకునేందుకు ఆర్థికంగా సాయం అందించేందుకు మౌర్య అంగీకరించారు. నగరంలోని పేదలకు (బంగారు కుటుంబాలు) ఏదో విధంగా సాయం చేసేందుకు మార్గదర్శకులు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎనిమిది నామినేషన్ల సిఫారసు

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు జిల్లా నుంచి ఎనిమిది నామినేషన్లు సిఫారసు చేసినట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. బుధవారం తన చాంబర్‌లో ఆమె మాట్లాడుతూ.. జిల్లా నుంచి 33మంది నుంచి నామినేషన్లు కోరగా, డీవైఈవోల ద్వారా 27 నామినేషన్లు వచ్చాయన్నారు. వీటిని డీఆర్వో మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో స్క్రూటినీ నిర్వహించి సెకండరీ గ్రేడ్ టీచర్స్ కేటగిరీలో రెండు, స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో నాలుగు, హెచ్‌ఎం కేటగిరీలో రెండు నామినేషన్లను పరిశీలన నిమిత్తం రాష్ట్రస్థాయికి పంపినట్లు చెప్పారు.

డిజిటల్ నెర్వ్ సెంటర్‌లో కలెక్టర్ తనిఖీలు



డిజిటల్ నెర్వ్ సెంటర్‌లో సిబ్బంది పనితీరును పర్యవేక్షిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

కుప్పం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నడుస్తున్న టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను బుధవారం కలెక్టర్ సుమిత్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడి పనితీరు, రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. వైద్యులు, వైద్య సిబ్బంది పనితీరును గమనించి తగు సూచనలిచ్చారు. రోగి ఆరోగ్య చరిత్రను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా క్షుణ్ణంగా డిజిటలైజ్ చేయాలని వారిని ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

సెప్టెంబరు మొదటివారంలోపు బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పూర్తి చేయండి

● అధికారులను ఆదేశించిన టీటీడీ ఈవో



తిరుమల మాడవీధిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో తదితరులు

తిరుమల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల మొదటి వారంలోపు బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశించారు. తిరుమలలో సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 2వ తేది వరకు జరుగనున్న బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఎస్పీ హర్షవర్ధనరాజు, సీవీఎస్వో మురళీకృష్ణతో కలిసి మాడవీధుల్లో తిరిగారు. గ్యాలరీల నుంచి భక్తులు ఇబ్బంది పడకుండా వాహనసేవలను వీక్షించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సెప్టెంబరు మొదటివారంలోపు ఇంజినీరింగ్ పనులు పూర్తిచేయాలన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు సీఎం చంద్రబాబు ప్రభుత్వం తరుపున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారన్నారు. మాడవీధుల్లో అదనపు మరుగుదొడ్ల ఏర్పాటుతో పాటు అవసరమైన పారిశుధ్య సిబ్బందిని నియమిస్తామన్నారు. ఈ ఏడాది అదనపు ట్రిప్పుల కోసం ఆర్టీసీ అధికారులను ఆదేశించామన్నారు. ముందస్తుగా పార్కింగ్ ప్రణాళికలు రూపొందించామని వివరించారు. టీటీడీ సీఈ సత్యనారాయణ, డిప్యూటీఈవో లోకనాథం, అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 237946

PLOTS FOR SALE
నేషనల్ హైవే IIT దగ్గర అంతరిక్ష పరిశోధన కేంద్ర అడ్మినిస్ట్రేషన్ ఆఫీసు ప్రక్కన ఫామ్ ల్యాండ్ 52 ఎకరాలలో ఎర్రచందనం చెట్లతో ఫైనల్ అప్రూవ్ ప్లాట్లు. ఫోన్: 95027 74175, 79959 92114.
AJT -1543

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

చెరువే.. డంపింగ్ యార్డు..!

● చెత్తతో నిండుతున్న కోమటివాని చెరువు ● ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలకు చేరని చెత్త
● అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం


కోమటివాని చెరువులో దించిన చెత్త


చెరువు పక్కనే డంపింగ్ చేసిన చెత్త

చౌడేపల్లె, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ప్రభుత్వం పారిశుధ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు.. అవగాహన ర్యాలీలు.. సదస్సులు నిర్వహిస్తోంది. గ్రామాల్లో ఇంటింటికీ చెత్తబుట్టలు సైతం అందించి తడి, పొడి చెత్తను గ్రీన్ అంబాసిడర్లతో సేకరిస్తున్నా.. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా గ్రామాల్లో ఎక్కడబడితే అక్కడ చెత్త దర్శనమిస్తోంది. చెత్తతో సంపద తయారీ కేంద్రాలకు తరలించాల్సిన అధికారులు ఏకంగా చెరువుల్లో డంపింగ్ చేయిస్తున్నారు. రోజూ సేకరించే చెత్త చెరువుల్లో డంపింగ్ చేయడంతో కలుషితమవుతున్నాయి. మండల కేంద్రమైన చౌడేపల్లెలో రోజూ సుమారు 4 ట్రాక్టర్ల చెత్తను పంచాయతీ కార్మికులు సేకరిస్తున్నారు. సేకరించిన చెత్తను గత రెండు నెలలకు ముందు ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రానికే తరలించే వారు. అలాగే ప్రజలకు, పంచాయతీ కార్మికులకు అప్పటి పంచాయతీ కార్యదర్శి మహేష్ అవగాహన కల్పించి చెత్తను డంపింగ్ యార్డుకే తరలించేలా చర్యలు తీసుకున్నారు. మండల కేంద్రంలో పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టారు.

ఇటీవల ఆయన బదిలీ కావడంతో ప్రస్తుతం కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన జాకీర్ చెత్త అంటే 'చెత్తే కదా అనుకున్నారో ఏమో' ఇంటింటా సేకరించిన చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలకు తరలించకుండా కోమటివాని చెరువులో రోజూ డంపింగ్ చేయిస్తున్నారు. రెండు నెలలకు ముందు సేకరించిన చెత్త నుంచి తడి, పొడి చెత్త, ప్లాస్టిక్‌ను వేరు చేసి విక్రయించేవారు. అలాగే చెత్తతో కేంద్రంలోని తొట్టిల్లో నింపి సేంద్రియ ఎరువులను తయారు చేయించేవారు. అలాగే ప్లాస్టిక్ వ్యర్థాలు, అట్టలు, ఇతర వ్యర్థాల నుంచి సైతం ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఆ దిశగా చర్యలు లేకపోగా చెత్తను ఎక్కడబడితే అక్కడ పంచాయతీ అధికారులు సమీపంలోని కోమటివానిచెరువులో దింపేస్తున్నారు. దీంతో చెరువు కలుషితం కావడంతోపాటు దుర్గంధం వెదజల్లుతోంది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి జాకీర్‌ను వివరణ కోరగా ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలోని తొట్టెలు నిండిపోయాయని.. మరెక్కడ డంప్ చేసుకోవాలని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. అయితే 1.5 ఎకరాల విస్తీర్ణంలో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం ఉన్నా... ఖాళీ స్థలమే లేదనడం గమనార్హం. అలాగే గ్రామం సమీపంలో ఉన్న అనంతరాయ చెరువు, చిట్రెడ్డిపల్లె చెరువుల్లోనూ కోళ్ల వ్యర్థాలను వేయడంతో దుర్గంధంగా మారుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి గ్రామ సమీపంలో ఉన్న చెరువులు చెత్తతో కలుషితం కాకుండా చెత్త నుంచి సంపద తయారీపై దృష్టి సారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలకే తరలిస్తాం

ఇంటింటికీ నిత్యం సేకరించే చెత్తను చెరువుల్లోకి తీసుకెళ్లి డంపింగ్ చేస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. ఇకపై కచ్చితంగా చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలకే తరలించేలా చర్యలు తీసుకుంటాం. ఇకపై ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం.

- లీలామాధవి, ఎంపీడీవో

దివ్యాంగులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం


దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిళ్లను పంపిణీ చేస్తున్న అధికారులు, నేతలు

రామకుప్పం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని దివ్యాంగులకు సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలుస్తోందని కుప్పం ఆర్డీవో శ్రీనివాసులురాజు, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి తెలిపారు. అలీంకో సంస్థల ఆధ్వర్యంలో రామకుప్పం, శాంతిపురం మండలాలకు చెందిన 1465 మంది దివ్యాంగులకు రూ.70.55 లక్షలు విలువ చేసే సహాయ పరికరాలను బుధవారం రామకుప్పంలో జరిగిన కార్యక్రమంలో ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ ప్రభుత్వంలోనూ ఇవ్వని విధంగా వేలాది మంది దివ్యాంగులకు సహాయ పరికరాలను అందిస్తున్న ఘనత ఎన్డీయే ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీకాంత్, తహసీల్దారు కౌలేష్, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, వైస్‌ఎంపీపీ వెంకట్రామగౌడు, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి, సింగిల్ విండో చైర్మన్ మహ్మద్‌రఫీ, నేతలు రామ్మూర్తి, శ్రీనివాసులురెడ్డి, జయశంకర్, గుర్రప్ప, వెంకటాచలం, మనోహర్, రఘు, కామరాజనాయక్, సలాంసాబ్, ఆదిల్, రవిరెడ్డి, అలివేలుమంగమ్మ, బాలరాజు, గజేంద్ర, సుబ్రీ, దయానంద తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చాలన్నదే చంద్రబాబు లక్ష్యం


భూమిపూజ చేస్తున్న అధికారులు, నేతలు

రామకుప్పం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదవారెవరూ ఆకలితో అలమటించరాదన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఆర్డీవో శ్రీనివాసులురాజు, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి తెలిపారు. బుధవారం రామకుప్పంలో రూ.60 లక్షలతో అన్నక్యాంటీన్ భవన నిర్మాణానికి వారు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ ఎన్టీఆర్ స్ఫూర్తితో 2014లో సీఎంగా చంద్రబాబు రాష్ట్రంలో అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేసి పేదలకు రూ.5లకే టిఫిన్, భోజనం అందించారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిని నిర్వీర్యం చేసి పేదల నోటి నుంచి కూడు లాక్కుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీకాంత్, తహసీల్దారు కౌలేష్, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, వైస్‌ఎంపీపీ వెంకట్రామగౌడు, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి, సింగిల్ విండో చైర్మన్ మహ్మద్‌రఫీ, నేతలు రామ్మూర్తి, రామకృష్ణప్ప, జయశంకర్, గుర్రప్ప, వెంకటాచలం, చంద్రశేఖర్‌రెడ్డి, జయశంకర్, వెంకటరమణ, సతీష్, కొళ్ళపల్లెవిజయ్‌కుమార్, రామలింగారెడ్డి, టీవీరవీ, అలివేలుమంగమ్మ, అవినాశ్‌రెడ్డి, సురేష్, మురళీ పాల్గొన్నారు.

పక్కాగృహ లబ్ధిదారులకు ఫ్యాన్ల పంపిణీ


లబ్ధిదారులకు ఫ్యాన్లు పంపిణీ చేస్తున్న నేతలు

రామకుప్పం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలోని 87 మంది పక్కాగృహ లబ్ధిదారులకు బుధవారం మండల సచివాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, ఇతర నేతలు ఫ్యాన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, వైస్‌ఎంపీపీ వెంకట్రామగౌడు, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, సింగిల్ విండో మహ్మద్‌రఫీ, నేతలు రామ్మూర్తి, రామకృష్ణప్ప, జయశంకర్, గుర్రప్ప, సత్తి, చంద్రశేఖర్‌రెడ్డి, మనోహర్, గజేంద్ర, శ్రీనివాసులుగౌడు, బాలరాజు, కామరాజనాయక్, అవినాశ్‌రెడ్డి, పెరుమాళ్, బాబు పాల్గొన్నారు.

23 నుంచి ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు


పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు తదితరులు

పలమనేరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో ఆగస్టు 23 నుంచి 25 వరకు జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు పిలుపు నిచ్చారు. బుధవారం పలమనేరు సీపీఐ కార్యాలయం వద్ద రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆయన విడుదల చేశారు.

● **పుంగనూరు రూరల్:** ఈనెల 23 నుంచి 25 వరకు ఒంగోలులో జరిగే రాష్ట్ర సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజన్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో రాష్ట్ర మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రామ్మూర్తి, మున్నా, వెంకటరమణారెడ్డి, మంజు, సూరి, శ్రీనివాసులు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

కుప్పం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలోని రామంద్ర రోడ్డులోని బ్రహ్మకుమారీస్ రాజయోగ శిక్షణ కేంద్రంలో ఈనెల 22వ తేదీన రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు బ్రహ్మకుమారీస్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు రక్తదానం చేయాలని వారు కోరారు.

కర్ణాటక మద్యం విక్రయాలపై చర్యలేవీ?

● మండల సమావేశంలో నిలదీసిన రెస్కో డైరెక్టర్ అమీర్



సమావేశంలో ఎక్సైజ్ పోలీసును నిలదీస్తున్న రెస్కో డైరెక్టర్ అమీర్

గుడుపల్లె, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనపల్లె గ్రామంలో వైసీపీ కి చెందిన కొందరు కర్ణాటక మద్యాన్ని అక్రమంగా వివిధ గ్రామాలకు సరఫరా చేస్తున్నారని.. వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఎక్సైజ్ పోలీసులను రెస్కో డైరెక్టర్ అమీర్ నిలదీశారు. సోమవారం స్త్రీశక్తి భవనంలో ఎంపీపీ వరలక్ష్మీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీలకు రావాల్సిన నిధులు సక్రమంగా విడుదల కాకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటు పడిందని, కొత్తగా బోర్లు వేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని పలువురు సర్పంచులు ఎంపీడీవో రాధాకృష్ణను కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు సీతారామ్, జడ్పీటీసీ కృష్ణమూర్తి, సింగిల్‌విండో అధ్యక్షులు రమేష్, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి

కుప్పం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కుప్పం పోలీసు డివిజన్ పరిధిలో వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహాలు పెట్టి ఉత్సవాలు జరుపుకునే ఉత్సవ కమిటీలు పోలీసు అనుమతి కోసం 'గణేశ్‌ఉత్సవ్.నెట్' అనే వెబ్‌సైట్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కుప్పం డీఎస్పీ పార్థసారథి తెలిపారు. పైన పేర్కొన్న వెబ్‌సైట్‌కు వెళ్లి ఉత్సవ కమిటీలోని ఏదో ఒక సభ్యుడి ఫోన్ నెంబర్ ఎంటర్ చేస్తే ఓటీపీ వస్తుందన్నారు. ఆ ఓటీపీని వెబ్‌సైట్‌లో పొందుపరిస్తే దరఖాస్తు డౌన్‌లోడ్ అవుతుందన్నారు. ఈ దరఖాస్తులో అవసరమైన అన్ని వివరాలతో కూడిన సమాచారం నింపితే ఆ అప్లికేషన్ స్థానిక పోలీసు స్టేషన్‌కు చేరుతుందని చెప్పారు. ఆ తర్వాత పోలీసులు వినాయక ఉత్సవ మండపాలు పెట్టే ప్రదేశానికి వెళ్లి విచారించి అన్నీ సక్రమంగా ఉంటే ఆన్‌లైన్ ద్వారానే అనుమతులు మంజూరు చేస్తారన్నారు. సదరు కమిటీ సభ్యులు 'గణేశ్‌ఉత్సవ్.నెట్' ద్వారా ఎన్‌వోసీ పొందాలని పేర్కొన్నారు. దీంతోపాటు సదరు మండప వివరాలతో క్యూఆర్ కోడ్ పొంది దాన్ని ల్యామినేషన్ చేసుకుని మండపాలవద్ద ప్రదర్శించాలని సూచించారు. క్యూఆర్ కోడ్ లేని విగ్రహ మండపాలను పోలీసు అనుమతి లేని వాటిగా పరిగణించి అటువంటి వారికి అనుమతి నిరాకరిస్తామన్నారు. కుప్పం పోలీసు సబ్ డివిజన్ పరిధిలో కేవలం మూడు రోజులు మాత్రమే ఉత్సవాలకు అనుమతి ఇస్తామని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి వేడుకల నిర్వహణకు ఈ నిబంధనలు విధించామని, తప్పనిసరిగా ఉత్సవ కమిటీలు పాటించాలని డీఎస్పీ కోరారు.

పలమనేరు పెద్దచెరువు పరిశీలన


గండిని పూడ్చిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌వో మోహన్

పలమనేరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు పెద్దచెరువును బుధవారం డీఆర్‌వో మోహన్ పరిశీలించారు. పెద్దచెరువులో నాలుగురోజుల క్రితం చెరువుకట్టకు గండి కొట్టిన ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం చెరువులో అక్రమంగా నిర్మించుకొన్న ఇళ్లను పశీలించి వివరాలు తెలుసుకున్నారు. చెరువు ఆక్రమణలకు గురికాకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి, తహసీల్దార్ ఇన్బనాథన్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

బత్తలాపురం సర్పంచ్‌కు సన్మానం



చౌడేపల్లె, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సర్పంచ్‌గా ఢిల్లీలో అవార్డు అందుకున్న గడ్డంవారిపల్లె సర్పంచ్ భాగ్యవతితోపాటు ఆమె భర్త హరినాథ్‌ను వైసీపీ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైసీపీ మండలాధ్యక్షులు నాగభూషణరెడ్డి, వైస్‌ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, జంగాలపల్లె వెంకటరమణ, రుక్మిణమ్మ పాల్గొన్నారు.

రీసర్వే పనులు వేగవంతం చేయండి


రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో భవాని

చౌడేపల్లె, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రీసర్వే పనులు వేగవంతం చేయాలని పలమనేరు ఆర్డీవో భవాని సూచించారు. బుధవారం ఆమె స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రీసర్వే పనులు త్వరగా చేయాలని, కుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి వెంటనే అందించాలని, అన్నదాత సుఖీభవ డబ్బులు జమకాని రైతుల పట్టాపాసుపుస్తకం, ఆధార్ లింక్ చేయాలని సూచించారు. తహసీల్దార్ పార్వతి, డీటీ రామ్మూర్తి, సర్వేయర్లు, వీర్‌వోలు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి : ఆర్డీవో

సదుం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : సదుం మండలం తిమ్మానాయునిపల్లె పంచాయతీ పరిధిలోని ఆక్రమిత కొర్లకుంటవారిపల్లె ప్రాజెక్టు భూములను ఆర్డీవో భవాని బుధవారం పరిశీలించారు. ప్రాజెక్టు భూములు ఆక్రమణకు గురైనట్లు ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదులపై స్పందించిన ఆమె ప్రాజెక్టు ఆక్రమిత భూములను తనిఖీ చేసి ఆక్రమణదారులతో మాట్లాడారు. నిబంధనలు ఉల్లంఘించి ప్రాజెక్టు భూములను ఆక్రమించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఏఎంవో మధుసూదన్‌నాయుడు

చౌడేపల్లె, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని ఏఎంవో మధుసూదన్‌నాయుడు సూచించారు. బుధవారం ఆయన రాజులూరు, స్థానిక ఎంఆర్‌సీ వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో తిరుమలమ్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివశంకర

సోమల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోలీసు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సోమల ఎస్ఐ శివశంకర తెలిపారు. బుధవారం నంజంపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోలీసు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ట్రాఫిక్‌లో ద్విచక్రవాహనాలు, సైకిళ్లపై వెళ్లే సమయంలో జాగ్రత్తగా నడపాలన్నారు. బాల్యవివాహాలు, మైనర్లు వాహనాలు నడపడం, గంజాయి, సైబర్ నేరాలు, సెల్‌ఫోన్ వినియోగం చేయరాదన్నారు. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం కుసుమాంబ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుంగనూరు ట్రైనీ ఎస్ఐగా చందనప్రియ



పుంగనూరు రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో ట్రైనీ సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా చందనప్రియ బుధవారం బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు తాలూకా స్టేషన్‌లో పనిచేస్తున్న ఆమెను శిక్షణ నిమిత్తం పుంగనూరుకు పంపారు.

నానో యూరియాతో భూములు సారవంతం



పుంగనూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నానో యూరియాతో భూములు సారవంతంగా మారడంతో పంటల్లో అధిక దిగుబడి సాధ్యమవుతుందని పుంగనూరు ఏడీఏ శివకుమార్ సూచించారు. బుధవారం స్థానిక ఏవో కార్యాలయంలో వ్యవసాయాధికారులు, రైతులతో మాట్లాడుతూ సాధారణ యూరియా కొద్దిరోజులకే గడ్డకడుతుందని, నానో యూరియా ఏడాది పాటు పంటలకు ఉపయోగపడుతుందని వివరించారు. సమావేశంలో పలువురు ఏవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

పుంగనూరు రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పట్టణంలోని హైదర్ కుమార్తె యూమాన్ (19) కనిపించలేదని బుధవారం తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. యువతి అదృశ్యంపై ఎస్ఐ వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలి

చౌడేపల్లె, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరి గా అనుమతి తీసుకోవాలని ఎస్ఐ నాగేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వైసీపీ అసత్య ప్రచారాలను మానుకోవాలి

రామకుప్పం/శాంతిపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అలజడులు రేపేందుకు వైసీపీ అసత్య ప్రచారాలకు పాల్పడుతోందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. అమరావతి మునిగిపోయిందని, ప్రకాశం బ్యారేజీ గేట్లు మెరాయించాయని, మామిడి, పొగాకు రైతులను ఆదుకోవడం లేదని, సహజ మరణాలను హత్యలని, టీటీడీ చైర్మన్ క్రిస్టియన్ అని అసత్యాలను వైసీపీ నాయకులు ప్రచారం చేస్తున్నారన్నారు. అలాగే ఎక్కడో జరిగిన రిగ్గింగ్ వీడియోలను పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో జరిగినవి అని వైసీపీ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వైసీపీ అసత్యాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. అసత్య ప్రచారాలను మానుకోవాలని హెచ్చరించారు.

టీడీపీ నేత మృతికి నివాళులు


కన్నాచారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం/శాంతిపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లెకు చెందిన టీడీపీ నేత కన్నాచారికి టీడీపీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, రెస్కో డైరెక్టరు అనసూయ, నేతలు మునేగౌడు, ఉయ్యాల జయరామిరెడ్డి, నాగభూషణం తదితరులు బుధవారం కన్నాచారి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతు డి కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

సీఎంను కలిసిన కుప్పం నేతలు



వి.కోట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును బుధవారం పలమనేరు, మదనపల్లె, కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సురేష్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై నమ్మకంతో ఉడా చైర్మన్‌గా ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, జిల్లా అధికార ప్రతినిధి రాంబాబు తదితరులు ఉన్నారు.

మొక్కజొన్న విత్తనాల పంపిణీ



పెద్దపంజాణి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పెద్దపంజాణి పశువైద్యకేంద్రంలో పాడి రైతులకు బుధవారం రాయితీ మొక్కజొన్న విత్తనాలను అందించారు. పశువైద్యాధికారులు సరిత, శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

రేగడదిన్నేపల్లెలో కావళ్ల పండుగ



రామకుప్పం/శాంతిపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం రేగడదిన్నేపల్లెలో బుధవారం కావళ్ల పండుగను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కావళలతోపాటు వీపుకు కొక్కీలు తగిలించుకుని వీపుతేర్లు లాగారు.

అంగన్‌వాడీ కార్యకర్త మెడలో చైన్ లాక్కెళ్లిన దుండగులు

వి.కోట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వి.కోటలోని జైభీంనగర్‌కు చెందిన అంగన్‌వాడీ కార్యకర్త అమరావతి బుధవారం కేంద్రానికి నడుచుకుంటూ వెళ్తుండగా బైక్‌పై కాపుకాసిన ఇద్దరు యువకులు ఆమె మెడలోని 25 గ్రాముల బంగారు గొలుసు లాక్కొని బ్రాహ్మణ వీధి మీదుగా పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ సోమశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నాయకుడి మృతికి పరామర్శ

సోమల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కందూరుకు చెందిన బాలిశెట్టి రెడ్డిబాబు ఆకస్మికంగా గుండెపోటుతో మృతిచెందడంతో బుధవారం టీడీపీ నాయకులు నివాళలర్పించారు. మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యులు పి.శ్రీనివాసులు, టి.శ్రీనివాసులు, నాయకులు బాలకృష్ణమనాయుడు, శంకర్, నౌషాద్, సుబ్బరాయులు, విశ్వనాథం, చంద్రబాబు, రెడ్డి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

సోమల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈవో శివరత్న బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని నెల్లిమంద, ఎగువపల్లె పాఠశాలల్లో ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పరిశీలించారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి


సూచనలు చేస్తున్న సీడీపీవో రాజేశ్వరి

సోమల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం గర్భిణులకు సక్రమంగా అందించాలని సీడీపీవో రాజేశ్వరి తెలిపారు. బుధవారం మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. మహిళల్లో రక్తహీనత, కాన్పు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కందూరు సెక్టార్ పరిధిలోని కార్యకర్తలు, ఆయాలతో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు.

రేపు పుంగనూరు ఏఎంసీ ప్రమాణస్వీకారం

● ఇద్దరు మంత్రుల రాక

పుంగనూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22న జరిగే పుంగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారానికి ఇద్దరు మంత్రులు వస్తున్నారని ఏఎంసీ చైర్మన్ నల్లబాల శమీపతి యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీ, సింగిల్ విండో పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిలుగా మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్దనరెడ్డి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి వస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తపాలా ఉద్యోగుల నిరసన

వి.కోట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ తపాలా ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండు చేస్తూ తపాలా ఉద్యోగులు వి.కోటలో నిరసన చేపట్టారు. బుధవారం ఉదయం వి.కోట సబ్ పోస్టాఫీసు ఎదుట ధర్నా చేపట్టారు. డిపార్టుమెంట్ ఉద్యోగులతో సమానంగా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు వినయ్‌కుమార్, సభ్యులు శ్రీనివాసులు, ప్రియాంక, వంశీ, వసుంధర, కుమారస్వామి, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘మామిడి’ సబ్సిడీ లబ్ధిదారుల జాబితాపై గ్రామసభ

యాదమరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని మామిడి సబ్సిడీ లబ్ధిదారుల జాబితాపై ఎంపీడీవో కార్యాలయంలో రైతులతో బుధవారం గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ పార్థసారథి, ఏవో దీప, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విజయపురం: కోసలనగరంలో ఏవో రజినీకుమారి ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో వీఆర్వో చరణ్, సచివాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పేర్లు లేని రైతులు ఆందోళన చెందవద్దు

పెనుమూరు: మండలంలోని ఆర్‌కేపురం, కేసీపల్లె, తాటిమాకులపల్లె, పెనుమూరు, రైతుసేవా కేంద్రాల్లో గ్రామసభలు జరిగాయి. ఫ్యాక్టరీలకు మామిడి కాయలు తరలించినా.. పేర్లులేని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. హార్టికల్చర్ అధికారులకు వివరాలందజేసి పేర్లు నమోదు చేసుకుంటే రెండో దఫాలో సబ్సిడీ వస్తుందని చెప్పారు. మాజీ జడ్పీటీసీ రుద్రయ్యనాయుడు, ఏవో సుహార్‌లత, వీహెచ్‌ఏలు ఢిల్లీబాబు, అములు, రైతులు పాల్గొన్నారు.

‘పీజీఆర్‌ఎస్’ అర్జీలను పరిష్కరించండి


సిబ్బందికి సూచనలిస్తున్న వెంకటనారాయణ

వెదురుకుప్పం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)కు వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జడ్పీ డిప్యూటీ సీఈవో డాక్టర్ వెంకటనారాయణ ఆదేశించారు. బుధవారం వెదురుకుప్పం ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సమాచార హక్కు చట్టం దరఖాస్తులకు నిర్దేశిత సమయంలోపు సమాచారం అందించాలని చెప్పారు. అన్ని గ్రామ పంచాయతీల్లో రోజూ ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పురుషోత్తం, ఏవో నాగమణి, ఉద్యోగులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి: ఆర్డీవో


రెవెన్యూ సిబ్బందితో చర్చిస్తున్న ఆర్డీవో అనుపమ

నగరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్డీవో అనుపమ ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది బుధవారం ఆమె సమీక్షించారు. తహసీల్దార్ రవికుమార్, డీటీ ధనంజయులు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ కథల పోటీల్లో విద్యార్థిని ప్రతిభ


సాయిరెడ్డి ఉదితి

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పురిమళ్ల ఫౌండేషన్ (ఖమ్మం) ఆధ్వర్యంలో జూన్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కవితలు, కథల పోటీల్లో దేవి బాలమందిర్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న వి.సాయిరెడ్డి ఉదితి ప్రతిభ చూపింది. చిన్నారి రాసిన మన భరత మాత (దేశభక్తి) కథ ఎంపికైందని కరస్పాండెంట్ రవీంద్రనాథ్ తెలిపారు. బుధవారం విద్యార్థిని ప్రిన్సిపాల్ సుజాత, ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు.

రోగులతో ప్రేమగా మెలగాలి


స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న పద్మమ్మ

బంగారుపాళ్యం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రోగులతో ప్రేమగా మెలగాలని వైద్య సిబ్బందికి మండల ప్రత్యేకాధికారి పద్మమ్మ సూచించారు. బుధవారం తుంబకుప్పం పీహెచ్‌సీతో పాటు బంగారుపాళ్యం-3, పాలేరు, తుంబకుప్పం అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పట్టుపరిశ్రమ శాఖ అధికారి విమల, టెక్నికల్ అసిస్టెంట్లు గణేష్‌యుగంధర్, సీడీపీవోలు కవిత, ఫామిదా తదితరులు పాల్గొన్నారు.

‘భూమిని పట్టలతో కప్పి ఉంచాలి’

పెనుమూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విధానంలో భాగంగా ఏడాదంతా భూమిని పంటలతో కప్పి ఉంచాలని కడప జిల్లా ప్రాజెక్టు మేనేజరు వాసు సూచించారు. బుధవారం కేసీపల్లె, తిరివిరెడ్డిపల్లె, చార్వాగానిపల్లె పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయ విధానంగా సాగుచేస్తున్న పంటలను పరిశీలించారు. సిబ్బంది హరిక్రిష్ణారెడ్డి, హనుమంతు, నవీన్, మణెమ్మ, హేమలత, అనిల్‌కుమారి పాల్గొన్నారు.

అనాథకు అంత్యక్రియలు



చిత్తూరు సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రెండో డిపో సమీపంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. అతడో అనాథ అని తెలియడంతో సంతపేటలోని మాతృసేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, ఏఆర్ ఎస్ఐ కరుణాకర్ (కంద) తమ సభ్యులతో వెళ్లి ఆ వృద్ధుడి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంద మాట్లాడుతూ.. 25 ఏళ్లుగా సుమారు 700కుపైగా అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించామని తెలిపారు. అనాథ మృతదేహాల సమాచారాన్ని 93916 65281 నెంబరుకు తెలియజేయాలని కోరారు.

బొమ్మయ్యపల్లె కాలనీలో అభివృద్ధి పనులకు అడ్డంకులు?

వెదురుకుప్పం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బొమ్మయ్యపల్లె కాలనీలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడానికి అడ్డంకులు ఎదురవుతున్నాయి. దీనిపై ఈనెల 18వ తేదీన తహసీల్దార్ బాబుకు ఎంపీడీవో పురుషోత్తం ఓ లేఖ రాశారు. పీఎంఏజీవై ఎన్‌ఆర్‌ఈజీఎస్, గ్రామ పంచాయతీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలంటే గ్రామ కంఠంలోని స్థలాలను పలువురు వ్యక్తులు ఆక్రమించుకుని ఉన్నారని తెలిపారు. ఆక్రమణలను తొలగించాలని కోరారు. ఈ నేపథ్యంలో బుధవారం కాలనీకి వెళ్లిన అధికారం యంత్రాంగానికి అడ్డంకులు ఏర్పడ్డాయని స్థానికులు తెలిపారు. ఈ నేపథ్యంలో యంత్రాంగం తదుపరి చర్యలు ఎలా ఉంటాయన్న విషయంగా చర్చనీయాంశమైంది.

విద్యార్థులు పోటీతత్వంతో చదవాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు

పూతలపట్టు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థీ పోటీతత్వంతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పూతలపట్టు మండలం పి.కొత్తకోట సమీపాన ఉన్న వేము ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో బుధవారం ఓరియెంటేషన్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థి దశ కీలకమైనదని చెప్పారు. ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యసనాలకు బానిస కావద్దని సూచించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ నాయుడు, ప్రిన్సిపాల్ నవీన్ కిల్లారి, హెచ్‌వోడీలు డాక్టర్ శశికళ, వైస్ ప్రిన్సిపాల్ సాయి శిరీష, అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, లెక్చరర్లు పాల్గొన్నారు.

కార్వేటినగరంలో ముగిసిన పవిత్రోత్సవాలు


పవిత్రాలతో అధికారులు, అర్చకులు - దేవేరులతో కలిసి ఊరేగుతున్న వేణుగోపాలుడు

వెదురుకుప్పం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు బుధవారం రాత్రి పూర్ణాహుతితో ముగిశాయి. వేకువ జామున సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు పూర్తిచేశారు. తర్వాత మూలవర్లకు, ఉత్సవర్లకు, గరుడాళ్వారుకు, పరివార దేవతలకు పవిత్రమాలలు సమర్పించారు. సాయంత్రం 5.30 గంటలకు తిరువీధి ఉత్సవం, పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగిశాయి. ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవికుమార్, ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, షరాబు సురేష్‌బాబు, అర్చకులు, టీటీడీ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు అన్న క్యాంటీన్‌కు భూమిపూజ

పూతలపట్టు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలకేంద్రంలో నూతనంగా అన్న క్యాంటీన్ ఏర్పాటుకు గురువారం ఉదయం 11 గంటలకు భూమిపూజ కార్యక్రమం ఉంటుందని టీడీపీ మండల అధ్యక్షుడు దొరబాబు చౌదరి తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మురళీమోహన్ వస్తారని, నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తలు హాజరవ్వాలని కోరారు.

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

యాదమరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులకు సక్రమంగా సరుకులను పంపిణీ చేయాలని చౌక దుకాణ డీలర్లను తహసీల్దార్ పార్థసారథి ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో డీలర్లతో సమీక్షించారు. తూకాల్లో తేడా రాకూడదని, ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీటీ జయంతి, ఆర్ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆ ప్రభుత్వ భూమిని ఆలయానికి కేటాయించాలి

● మురకంబట్టువాసుల వినతి


ఆలయం వద్ద నినాదాలు చేస్తున్న మురకంబట్టు వాసులు

చిత్తూరు రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మురకంబట్టులోని కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడి సుందర వెంకటేశ్వరస్వామి ఆలయానికి కేటాయించాలని స్థానికులు విన్నవించారు. ఈ మేరకు ఆలయం వద్ద బుధవారం ధర్నాచేశారు. వారు మాట్లాడుతూ.. ఆలయం పక్కనే సుమారు 90సెంట్ల ప్రభుత్వ భూమి ఎన్నో ఏళ్లుగా ఆలయ ఆధీనంలో ఉందన్నారు. ఇందులో నాలుగు నెలల కిందట ఆంజనేయ ఆలయం నిర్మాణం ప్రారంభించామన్నారు. ఇంతలో స్థానిక బీజేపీ నాయకుడు చిన్ని, తన అనుచరులతో కలిసి గుడిని కూలగొట్టాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కేసు కూడా నమోదైందన్నారు. అయితే ఆయన డబ్బు, అధికార పార్టీ నాయకుల అండతో కేసు నుంచి బయటపడ్డాడని ఆరోపించారు. తాజాగా ఇంకొందరు ఈ భూమికి తప్పుడుపత్రాలు సృష్టించి కాజేయాలని చూస్తున్నారని చెప్పారు. ఈ భూమి కబ్జాదారులపరం కానివ్వమని హెచ్చరించారు. కార్పొరేటర్ సహదేవన్, 51వ డివిజన్ అధ్యక్షుడు గోపి, 50వ డివిజన్ ఉపాధ్యక్షుడు విజయ్, మొదలియార్ సంఘం జిల్లా డైరెక్టర్ గోపి, నాయకులు వెంకటేష్, మాజీ సర్పంచ్ కారికేయన్, 1, 2 డివిజన్ ప్రజలు సుమారు 20 మంది వరకు పాల్గొన్నారు.

మాజీ పీఏసీఎస్ డైరెక్టర్‌కి నివాళి

నగరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):నగరి మండలం మేలపట్టుకు చెందిన టీడీపీ సీనియర్ నేత, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ రామచంద్రనాయుడు అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం ఆయన మృతదేహానికి నగరి పీఏసీఎస్ చైర్మన్ బాలాజి, టీడీపీ మండల అధ్యక్షుడు జవహర్‌రెడ్డిలు పూలమాల వేసి, నివాళి అర్పించారు.

‘ఏసీ’ కార్యాలయాన్ని మార్చాల్సిన అవసరం ఏముంది?

● జడ్పీ సమావేశంలోనూ చర్చ

చిత్తూరు రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ) కార్యాలయాన్ని దశాబ్దానికిపైగా చిత్తూరు చర్చివీధిలోని జీవకారుణ్య సత్రంలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యాలయం రైల్వేస్టేషన్, బస్టాండుకు చేరువలో ఉంది.

ఆర్జేసీ పట్టించుకోవాలి

దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్(ఆర్జేసీ) గురువారం కాణిపాకం రానున్నారు. ఈ నేపథ్యంలో ఏసీ కార్యాలయ అంశాన్ని ఆర్జేసీ అయినా పట్టించుకోవాలని అర్జీదారులు కోరుతున్నారు.


శ్రీపురం సత్రం స్థలంలో నిర్మిస్తున్న భవనం

ఇప్పుడు నగరానికి సుమారు మూడు, నాలుగు కిలోమీటర్ల దూరంలోని సంతపేట ప్రాంతంలోని శ్రీపురం సత్రంలో ఫంక్షన్ హాలు పేరుతో నిర్మిస్తున్న భవనంలో ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. దీనివల్ల ఇటు అర్చకులు, అటు అర్జీదారులు ఇబ్బంది పడతారని గత నెలలోనే నూతనంగా నిర్మిస్తున్న భవనం వద్ద సీపీఐ నాయకులు ధర్నా చేశారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్‌కు వినతి పత్రం కూడా సమర్పించారు. ఇదే అంశంపై గత వారం జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలోనూ చర్చ జరిగింది. విచారణ చేయిస్తామని జేసీ విద్యాధరి తెలిపారు.

కాణిపాకంలో ప్రదోష కాల పూజలు


మహానందికి హారతి ఇస్తున్న అర్చకుడు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ఆలయానికి అనుబంధంగా ఉన్న మరగదాంబిక సమేత మణికంఠేశ్వర స్వామి గుడిలో బుధవారం సాయంత్రం ప్రదోషకాల పూజలను అర్చకులు నిర్వహించారు. సాయంత్రం మూల విరాట్‌కు, ఎదురుగా ఉన్న మహానందికి అభిషేకం చేశారు. ఈవో పెంచలకిషోర్, ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, అర్చక, పండితులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం శిష్ట సౌందర్యవల్లి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం నందీశ్వరుడికి ప్రదోష కాల పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు.

మినీ గోకులం షెడ్ల నిర్మాణంపై అవగాహన

యాదమరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలానికి కొత్తగా మంజూరైన 190 మినీ గోకులం షెడ్లు నిర్మించే విధానం, బిల్లులపై బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. చిత్తూరు ఏపీడీ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో వేణు, ఏపీవో సంధ్యారాణి, వెటర్నరీ డాక్టర్ మునిచంద్ర, ఉపాధి హామీ పథకం సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాల దిగుబడి పెంచండి


గిర్‌జాతి ఆవుల వివరాలు తెలుసుకుంటున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి

పాలసముద్రం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా గ్రూపు సంఘాల మహిళలు మేలు రకాలైన పాడిపశువులను పెంచి పాల దిగుబడి పెంచాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి సూచించారు. బుధవారం వెంగ్రాజుకుప్పంలో ఓ రైతు వద్ద ఉన్న గిర్ జాతి ఆవులను పరిశీలించారు. అలాగే పాలసముద్రంలో వెలుగు శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న బీఎంసీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వెలుగు కార్యాలయంలో సంఘ మిత్రలతో సమావేశమై పలు సూచనలిచ్చారు. డీపీఎం సుబ్బారెడ్డి, సునీతాలక్ష్మి, ఏపీఎం కల్పలతారెడ్డి, సీసీలు పాల్గొన్నారు.

‘ఉపాధి’లో ఇకపై ఫొటో ఆధారిత హాజరు: ఏపీడీ


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీడీ సునీల్‌కుమార్

నింద్ర, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో ఇకపై ఫొటో ఆధారిత హాజరును అమలు చేయనున్నట్లు నగరి క్లస్టర్ ఏపీడీ సునీల్‌కుమార్ తెలిపారు. బుధవారం నింద్ర సీఎల్‌ఆర్‌సీ భవనంలో నగరి, నింద్ర, విజయపురం, వెదురుకుప్పం, కార్వేటినగరం, ఎస్‌ఆర్‌పురం మండలాలకు చెందిన సాంకేతిక, క్షేత్ర సహాయకులకు ఎన్‌ఎంఎంఎస్, క్లార్ట్ యాప్‌పై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. రిసోర్స్‌పర్సన్ జయచంద్ర పాల్గొన్నారు.

‘మాకు న్యాయం చేయండి’

గుడిపాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సర్వీసు రోడ్డు ఏర్పాటులో భాగంగా దుకాణాలపై వేసుకున్న షీట్లను తొలగించాలని హైవే, రెవెన్యూ అధికారులు ఆదేశాలు జారీ చేశారని జీజేఎం ట్రస్టు నిర్వాహకుడు చెన్నకేశవులు నాయుడికి గుడిపాలలోని వ్యాపారులు తెలిపారు. దీనిపై అధికారులతో మాట్లాడి తమకు న్యాయం జరిగేలా చూడాలని విన్నవించారు.

విద్యార్థులకు బహుమతిగా బ్యాగులు



తవణంపల్లె, ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి): పొగాకు నియంత్రణలో భాగంగా అత్యధిక సంఖ్యలో సంతకాలు సేకరించిన విద్యార్థులకు బహుమతిగా బ్యాగులను ఎంఈవో హేమలత బుధవారం తన కార్యాలయంలో అందజేశారు. మోహిత్ సాయి ఆచారి, మహీధర్, సాకేత్‌కుమార్‌రెడ్డి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని చెప్పారు. ఉపాధ్యాయులు సీపీ సుధాకర్‌రెడ్డి, లవన్‌కుమార్‌రెడ్డి, సీఆర్‌ఎంటీ గోపి, పొగాకు నియంత్రణ సామాజిక కార్యకర్తలు లావణ్య, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై నాలుగు అర్జీలు


అర్జీని పరిశీలిస్తున్న డీఈ ప్రసాద్

చిత్తూరు రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి నాలుగు అర్జీలు అందాయని డీఈ ప్రసాద్ తెలిపారు. బుధవారం గాంధీ రోడ్డులోని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ విద్యుత్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. వచ్చిన అర్జీలను వారంలోపు పరిష్కరిస్తామని డీఈవో చెప్పారు.

నగరి ఏఎంసీ చైర్‌పర్సన్‌కు పతీవియోగం


సుబ్రహ్మణ్యంరాజు మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న చినబాబు, టీడీపీ నేతలు

విజయపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నగరి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్‌పర్సన్ రాజమ్మ భర్త డి.సుబ్రహ్మణ్యంరాజు బుధవారం ఉదయం తమిళనాడులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్, మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు బాబుయాదవ్, తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు గుణభూషణమ్మ, నాయకులు మహారాజపురంలో ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి

నగరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలని నగరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ సూచించారు. కళాశాలలో బుధవారం జవహర్‌నాలెడ్జ్ సెంటర్, కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో డిగ్రీ ఫైనల్ విద్యార్థులకు ఒకరోజు ఉద్యోగ సిద్ధత శిబిరాన్ని నిర్వహించారు. 1ఎం1బీ గ్రీస్ స్కిల్స్ అకాడమీ సహకారంతో జరిగిన కార్యక్రమంలో జేకేసీ కో-ఆర్డినేటర్ పంకజం, కెరీర్ గైడెన్స్ సెల్ కో0ఆర్డినేటర్ రేవతి పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛను అందాలి: ఎమ్మెల్యే

పూతలపట్టు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పింఛను అందాలని ఎమ్మెల్యే మురళీమోహన్ ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో పింఛన్లపై నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్షించారు. అర్హత ఉన్నా పింఛన్ తొలగించిన వారి జాబితా, అర్హత లేకున్నా పింఛన్ పొందుతున్న వారి జాబితాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని చెప్పారు.

మా పింఛను పునరుద్ధరించండి

● ఎంపీడీవోలకు దివ్యాంగుల వినతి

ఐరాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తమ పింఛను పునరుద్ధరించాలంటూ పలువురు దివ్యాంగులు విన్నవించారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీవో ధనలక్ష్మిని కలిసి విన్నవించారు. ఆమె మాట్లాడుతూ.. పాత సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, అధికారులిచ్చిన నోటీసు తీసుకెళితే వైద్య పరీక్షలు చేసి కొత్త సదరం సర్టిఫికెట్ ఇస్తారన్నారు. పొరబాటున తొలగించి ఉంటే కొత్త సర్టిఫికెట్ వచ్చాక అర్హులందరికీ పింఛను మంజూరు చేస్తామన్నారు.


ఎంపీడీవో ధనలక్ష్మితో మాట్లాడుతున్న దివ్యాంగులు

క్యూకడుతున్న బాధితులు

పెనుమూరు: మండలంలో బుధవారం ఒక్కరోజే 37 మంది తమ పింఛను రద్దు చేశారని ఎంపీడీవోకు అర్జీలు ఇచ్చారు. సామిరెడ్డిపల్లె పంచాయతీ బట్టువారిపల్లె దళితవాడకు చెందిన శ్రీరాములు మాటలు రావు.. పక్షవాతంతో కాళ్లు చేతులు పనిచేయవు. ఇతడికి ఇస్తుండిన రూ.15వేల పింఛను తొలగించి.. రూ.6వేలను ఇస్తామని అధికారులు నోటీసు ఇచ్చారు. దాంతో ఆ దివ్యాంగుడు తన కుటుంబీకుల సాయంతో ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి వినతిపత్రం అందజేసి, న్యాయం చేయాలని వేడుకున్నాడు.


శ్రీరాములును తీసుకొస్తున్న కుటుంబీకులు

సంక్షిప్తంగా..

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి: సీఐ

వెదురుకుప్పం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని పురస్కరించుకుని వీధుల్లో గణేశుడి ప్రతిమలను ఏర్పాటు చేయడానికి పోలీసు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కార్వేటినగరం సీఐ హనుమంతప్ప తెలిపారు. బుధవారం కార్వేటినగరంలో మీడియాతో మాట్లాడుతూ.. ఎస్పీ ఆదేశాల మేరకు నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. అలా తీసుకోకుంటే మండపాలను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు కూడా తమ వంతు సహకారం పోలీసులకు అందించాలని విజ్ఞప్తి చేశారు.

పెనుమూరు: వినాయకచవితి మండపాల ఏర్పాటుకు Ganeshutsav.net ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఐ వెంకటనరసింహం సూచించారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన

నింద్ర, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నింద్రలో హెల్మెట్ వాడకంపై పోలీసులు బుధవారం అవగాహన కల్పించారు. నగరి డీఎస్పీ ఆదేశాలతో రూరల్ సీఐ భాస్కర్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ కూడా చేశారు. విజయపురం ఎస్ఐ మహేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

విజయపురం: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ మహేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పేయదూడల ప్రదర్శన

పెనుమూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తాటిమాకులపల్లెలో బుధవారం పేయదూడల ప్రదర్శన ఏర్పాటు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, పుత్తూరు డివిజన్ డీడీ గోవిందయ్య, పూతలపట్టు, పెనుమూరు డాక్టర్లు విజయ్‌మోహన్, సుబ్రహ్మణ్యం, చానుక్య, జగదీష్, మాజీ సర్పంచ్ అశోక్, నాయకులు మోహన్, లక్ష్మీపతి, రఘుపతి, రైతులు పాల్గొన్నారు.

టీవీల విరాళం



ఐరాల(కాణిపాకం), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ఆలయానికి చిత్తూరు విమ్‌సన్స్ అధినేత రవీంద్ర, రమణ స్యామ్‌సన్ 55 ఇంచీల రెండు టీవీలను బుధవారం విరాళంగా అందించారు. దాతలను ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్

చిత్తూరు అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వాకింగ్ చేస్తున్న ఓ మహిళా మెడలోని చైన్‌ను లాక్కెళ్లిపోయారు. సీఐ మహేశ్వర తెలిపిన వివరాల మేరకు.. కొంగారెడ్డిపల్లెలోని కామేశ్వరనగర్‌లోని ఉమామహేశ్వరి తాను నివాసముంటున్న వీధిలో మంగళవారం రాత్రి వాకింగ్ చేస్తోంది. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంలో వచ్చి ఆమె మెడలోని 42 గ్రాముల బంగారు చైన్‌లాక్కెళ్లిపోయారు. బుధవారం బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

తాగునీటి వృథాను అరికట్టలేరా?


పైప్‌లైన్ దెబ్బతిని వృథాగా పోతున్న నీరు

పెనుమూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గుత్తావాండ్లవూరు పంచాయతీ పరిధిలోని గంగుపల్లె మఠంపల్లె దళితవాడకు గంగుపల్లె చెరువు నుంచి తాగునీరు సరఫరా అవుతుంది. చిత్తూరు మార్గంలో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద దీనికి సంబంధించిన పైపులైను దెబ్బతిని నెల రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. వెంటనే మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సన్మానం

వెదురుకుప్పం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగులకు బుధవారం పాతగుంట సచివాలయంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం జరిగింది. సర్పంచ్ భువనేశ్వరి, ఉపసర్పంచ్ గురుమూర్తిరెడ్డి, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రబాబురెడ్డి, నాయకులు తిమ్మరాజు, లోకనాథరెడ్డి పాల్గొన్నారు.